మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 25-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 326 Issue: 326

25 మే 2026 - సోమవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:45, సూర్యాస్తమయం - సా. 6:40, తిథి, దశమి తె. 5:11 వరకు, తరువాత ఏకాదశి, సంస్కృత వారం, ఇందు వాసరః, నక్షత్రం, ఉత్తర ఫల్గుని(ఉత్తర) తె. 4:050 వరకు, తరువాత హస్త, యోగం, వజ్ర తె. 3:11 వరకు, కరణం, తైతుల సా. 4:50 వరకు, గరజ తె. 5:11 వరకు, వర్జ్యం, ఉ. 10:25 నుండి మ. 12:06 వరకు, దుర్ముహూర్తం, మ. 12:38 నుండి మ. 1:30 వరకు, మ. 3:13 నుండి సా. 4:05 వరకు, రాహుకాలం, ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు, యమగండం, ఉ. 10:36 నుండి మ. 12:13 వరకు, గుళికాకాలం, మ. 1:50 నుండి మ. 3:26 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:09 నుండి తె. 4:57 వరకు, అమృత ఘడియలు, రా. 8:31 నుండి రా. 10:13 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana


# జవానుకు జవాన్లు తోడుగా..!



### ఐటీబీపీ జవాన్లు కాన్పూర్ పోలీస్ కమిషనరేట్ ముట్టడి.. సహచర సోల్జర్ కోసం తరలివచ్చిన సైనికులు

**సినిమాల్లో హీరోకు తోడుగా ఒక్కసారిగా వందల మంది సైనికులు ట్రక్కుల్లో సడెన్ ఎంట్రీ ఇస్తే ఎలా ఉంటది? గన్స్‌తో, బూట్ల సౌండ్‌తో దద్దరిల్లిపోతుంది. ఆ సీన్ చూస్తేనే రోమాలు నిక్కపొడుస్తాయి. అచ్చం అలాంటి ఘటనే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం హైడ్రామా చోటు చేసుకుంది.**

కాన్పూర్: దేశ సరిహద్దులను కాపాడే ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్‌కి చెందిన దాదాపు 50 మంది సాయుధ జవాన్లు ట్రక్కులు, జీప్సీ వాహనాలలో కాన్పూర్ పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. అత్యాధునిక ఆయుధాలు ధరించిన ఈ జవాన్లు గంటకు పైగా కమిషనరేట్ ప్రాంగణంలోని ప్రతి గదికి వెళ్లటం స్థానిక పోలీసులలో తీవ్ర ఆందోళన కలిగించింది. తమ సహచర జవాన్‌కు జరిగిన తీవ్ర అన్యాయం, స్థానిక పోలీసుల ఉదాసీనతపై నిరసనగా వారు ఈ రకంగా కమిషనరేట్‌ను ముట్టడించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. మహారాజ్‌పూర్‌లోని 32వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న - తరువాయి 2 వ పేజీలో...




## 24 మంది పాక్ సైనికులు మృతి

### ప్యాసింజర్ రైలుపై బీఎల్ఏ ఆత్మాహుతి దాడి

క్వెట్టా: పాకిస్థాన్‌లో సైనికులపై భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. క్వెట్టా పరిధిలోని చమన్ ఫాటక్ రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో జరిగిన ఈ విస్ఫోటనంలో 24 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో 50 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులను తీసుకెళ్తున్న ఒక రైలును లక్ష్యంగా చేసుకుని కొందరు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మరణించిన వారిలో అత్యధికులు పాక్ సైన్యానికి చెందిన వారే కావడంతో ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. రైల్వే అధికారుల కథనం ప్రకారం.. ఆర్మీ బలగాలు, వారి బంధువులతో కూడిన రైలు చమన్ ఫాటక్ స్టేషన్ పరిసరాల్లోని సిగ్నల్ దాటుతున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. భారీ ఎత్తున పేలుడు పదార్థాలు నింపిన ఒక అపరిచిత - తరువాయి 2 వ పేజీలో...

## యువతకు తుంటి తంటాలు



### యుక్త వయసులోనే హిప్ జాయింట్ సమస్యలు



**40 శాతం పెరిగిన తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు**

**కొవిడ్‌లో అధిక స్టెరాయిడ్సే ప్రధాన కారణం**

**కరోనా మహమ్మారి ముగిసిపోయిందని ప్రపంచం భావిస్తున్న సమయంలో, దాని ప్రభావాలు మాత్రం ఇంకా ప్రజల ఆరోగ్యంపై కనిపిస్తూనే ఉన్నాయి. కొవిడ్ దెబ్బకు శరీరం గుల్ల అవుతోంది. అలసట, శ్వాసవ్యాధులు, ఛాతీ నొప్పి, పొడి దగ్గు, ఏకాగ్రత తగ్గిపోవడం, తలనొప్పి, మైకం, నిద్రలేమి, ఒళ్లు నొప్పులను తెచ్చి పెట్టింది. దానికితోడు మానసిక కుంగుబాటు, తీవ్ర ఒత్తిడి, ఏదో తెలియని ఆందోళనతో సతమతం అవుతున్నాం.**

(ఈవార్తలు- స్పెషల్ డెస్క్)

ఇవి చాలవన్నట్లు యువతపై పెను ప్రభావాన్ని చూపిస్తోంది. తుంటి ఎముకను దెబ్బతీసి యువత నడ్డి విరుస్తోంది. తాజాగా దేశవ్యాప్తంగా యువతలో హిప్ జాయింట్ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారిలో హిప్ ఆర్థరైటిస్, అవాస్క్యులర్ నెక్రోసిస్ (ఏవీఎన్) వంటి సమస్యలు గణనీయంగా పెరిగినట్లు చెబుతున్నారు. న్యూఢిల్లీలో జరిగిన 'ఢిల్లీ హిప్ 360' సదస్సులో దేశంలోని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా తర్వాత యువతలో హిప్ - తరువాయి 2 వ పేజీలో...

## హర్మూజ్ ఓపెన్

### యురేనియం నిల్వలను వదులుకుంటున్నాం

**ఇరాన్ ప్రకటన.. అమెరికాతో శాంతి ఒప్పందం**

**మధ్యప్రాచ్యంలో మూడు నెలలుగా సాగుతున్న భీకర యుద్ధాన్ని ముగించే దిశగా ఒక ఊహించని భారీ మలుపు చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాతో సాగుతున్న శాంతి చర్చల్లో భాగంగా.. తన వద్ద ఉన్న అత్యంత ప్రమాదకరమైన సుసంపన్న యురేనియం నిల్వలను వదులుకునేందుకు ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించింది.**



టెహ్రాన్: ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు ధృవీకరించారు. శ్వేతసౌధం, టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం ముగింపు దశకు చేరిందని.. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరుదేశాలు సిద్ధం అవుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) నివేదికల ప్రకారం.. ఇరాన్ వద్ద ప్రస్తుతం ఆయుధ స్థాయికి అత్యంత సమీపంలో ఉండే (60 శాతం స్వచ్ఛత కలిగిన) దాదాపు 400 కిలోల సుసంపన్న యురేనియం నిల్వలు ఉన్నాయి. దీనితో ఇరాన్ ఒకటి కంటే - తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,906 |
| వెండి (కిలో): | రూ.2,95,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,058 |

## జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన

ఖమ్మం, మే 24 (ఈవార్తలు): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గుడ్ న్యూస్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, నిరుపేదల ముంగిటకే సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మక 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కులమతాలకు - తరువాయి 2 వ పేజీలో...



## ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర


### మోటార్లకు ప్రీపెయిడ్ మీటర్లు.. రైతులకు కాంగ్రెస్ సర్కారు దగా సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

**తెలంగాణలో ఉచిత విద్యుత్తును పూర్తిగా రద్దు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్లకు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు ప్రీపెయిడ్ మీటర్లు పెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు.**


హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిన్నటి క్యాబినెట్ భేటీలో గ్రామాల్లో, పట్టణాల్లోని ఇళ్లతో పాటు వ్యవసాయ రంగానికి కూడా మూడు నెలల్లో ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని అదానీ, అంబానీ లాంటి ప్రైవేట్ సంస్థలకు అప్పగించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కరెంటు కుట్రలకు తెరలేపారని ధ్వజమెత్తారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా, 30 వేల కోట్ల రూపాయల రుణాన్ని ఆపినా కేసీఆర్ రైతుల కోసం మీటర్లు పెట్టడానికి అస్సలు ఒప్పుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ వస్తే ఉచిత విద్యుత్తు పోతుందని తాము ఎన్నికల ముందే హెచ్చరించిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఐదు సంవత్సరాల పాలనా కాలంలో సగం పూర్తయినా రాష్ట్రానికి ఒక్క మంచి పని కూడా చేయలేదని కేటీఆర్ విమర్శించారు. అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై - తరువాయి 2 వ పేజీలో...



### విశ్వవాణి



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం జంతువులపై క్రూరత్వానికి పాల్పడి దోషులుగా తేలినవారు పెంపుడు జంతువులను దత్తత తీసుకోవడం లేదా కొనుగోలు చేయడాన్ని నిషేధించింది. షెల్టర్లు, బ్రీడర్స్ ఇలాంటివారికి జంతువులను ఇవ్వకుండా నిరోధించడానికి నిందితుల డేటాబేస్‌ను కూడా ఏర్పాటు చేసింది.



## ఆల్చిప్పల కోసం వెళ్లి 8 మంది మృతి

**కర్ణాటకలో ఘోర విషాదం**

**నదిలో మునిగి మృత్యువాత**

బెంగళూరు: కర్ణాటకలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆల్చిప్పల కోసం నదిలోకి దిగి ఒకే కుటుంబానికి చెందిన 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర కన్నడలోని భత్కళ తాలూకా తట్టేహక్కలు అనే నదిలో ఈ విషాదం చోటుచేసుకుంది. చనిపోయిన - తరువాయి 2 వ పేజీలో...

## బస్సులో భరోసా

**ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు**

**టీజీఎస్ ఆర్టీసీ వినూత్న నిర్ణయం**

**ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు షురూ**

**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ రవాణా రంగంలో సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు, చిన్నారుల రక్షణకు మరింత భరోసా కల్పించేందుకు బస్సుల లోపల సరికొత్త హైటెక్ నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది.**



ఆదిలాబాద్, మే 24 (ఈవార్తలు): ఇందులో భాగంగానే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'బస్సులో భరోసా' పైలట్ ప్రాజెక్ట్‌ను సంస్థ ఉన్నతాధికారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికారికంగా ప్రారంభించారు. ఈ నూతన నిఘా నేత్రాల వ్యవస్థ ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలకు మరింత సురక్షితమైన - తరువాయి 2 వ పేజీలో...



## మేడిగడ్డ కీలక ఫైల్స్ దగ్ధం!

**ఎల్అండ్ టీ కార్యాలయంలో అగ్నిప్రమాదం**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన**

**కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజీ వద్ద ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టిన ప్రముఖ నిర్మాణ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రోకి చెందిన సైట్ కార్యాలయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.**

భూపాలపల్లి, మే 24 (ఈవార్తలు): ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆఫీసు క్యాబిన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కార్యాలయం నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే - తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

25-5-2026

**మేషం:** నూతన ప్రయత్నాలు ముందుకు సాగవు. బంధువుల నుంచి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. ప్రయాణాలలో మార్పులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఆర్థిక విషయాలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటుంది.

**వృషభం:** ముఖ్యమైన వ్యవహారాలలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. సంతానానికి నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి.

**మిధునం:** దూరప్రయాణాలు వాయిదా పడతాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో వాదోపవాదాలకు దిగడం మంచిది కాదు. ముఖ్య కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉంటాయి.

**కర్కాటకం:** సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ప్రయాణాలలో కొత్త పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

**సింహం:** బంధుమిత్రులతో సేవా కార్యక్రమాలు చేపడతారు. స్థిరాస్తి వివాదాలు పెద్దల సహాయంతో రాజీ చేసుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగాలలో విలువైన పత్రాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

**కన్య:** ఆత్మీయుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కొన్ని విషయాలు ఆశ్చర్యపరుస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి. విద్యార్థులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

**తుల:** ఇంటా బయట విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటాయి. నూతన వస్తులాభాలు పొందుతారు. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగయత్నాలు కలసివస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం నుండి కొంత ఉపశమనం పొందుతారు.

**వృశ్చికం:** చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు సాగిస్తారు. మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**ధనస్సు:** ఆరోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్పదు. దీర్ఘకాలిక ఋణాల వలన ఒత్తిడి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల తీసుకోకపోవడం మంచిది. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది.

**మకరం:** స్థిరాస్తి ఒప్పందాలు అనుకూలిస్తాయి. గృహమున బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. నూతన పరిచయాలు సంతోషాన్నిస్తాయి. సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

**కుంభం:** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ సమర్థతను చాటుకుంటారు. వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి ధన సహాయం అందిస్తారు. చేపట్టిన పనులు చకచకా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

**మీనం:** కుటుంబ సభ్యుల ప్రవర్తన వల్ల కొంత చికాకు పెరుగుతుంది. పని ఒత్తిడి అధికమై శిరో బాధలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. సన్నిహితులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

# జవానుకు జవాన్లు తోడుగా..!

(మొదటి పేజీ తరువాయి)

వికాస్ సింగ్ అనే ఐటీబీపీ జవాన్ తల్లి నిర్మలా దేవి మే 13న తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడటంతో తాట్మిల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స సమయంలో వైద్యులు ఆమె చేతికి క్యాన్యులా అమర్చిన కొద్దిసేపటికే ఆమె చేయి నల్లగా మారిపోయి తీవ్రమైన వాపు వచ్చింది. ఇన్ఫెక్షన్ శరీరం మొత్తం పాకకుండా ఉండేందుకు మే 17న బిథూర్ రోడ్డులోని మరొక ఆసుపత్రి వైద్యులు ఆమె కుడి చేతిని పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. వైద్యుల తప్పుడు ఇంజెక్షన్, తీవ్ర నిర్లక్ష్యం వల్లే తన తల్లి చేయి కోల్పోయిందని జవాన్ వికాస్ సింగ్ ఆరోపించారు. ఈ దారుణంపై స్థానిక రైల్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో జవాన్ వికాస్ సింగ్ తన తల్లి తెగిపడిన చేతిని ఒక ఐస్ కంటైనర్‌లో భద్రపరిచి న్యాయం కోసం మూడు రోజుల పాటు కాన్పూర్ లోని వివిధ పోలీస్ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. దీంతో పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ స్పందించి సీఎంవో విచారణకు ఆదేశించారు. అయితే శుక్రవారం వైద్య అధికారులు సమర్పించిన నివేదిక సదరు ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాన్ని, తప్పు చేసిన వైద్యులను వెనుకేసుకొచ్చే విధంగా ఉందని వికాస్ సింగ్, ఇతర ఐటీబీపీ జవాన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం ఐటీబీపీ కమాండెంట్ గౌరవ్ ప్రసాద్, కానిస్టేబుల్ వికాస్ సింగ్‌తో కలిసి కమిషనర్‌ను



కలవడానికి రాగా.. వారికి మద్దతుగా సాయుధ జవాన్లు భారీగా తరలివచ్చారు. దీంతో దిగివచ్చిన ఉన్నతాధికారులు గతంలో ఇచ్చిన వైద్య నివేదికను పక్కనబెట్టి.. పోలీస్ అధికారులు, ఐటీబీపీ ప్రతినిధులు, సీఎంవో నామినేట్ చేసిన వైద్యులతో కూడిన మరో ఉమ్మడి దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేస్తూ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇది ముట్టడి కాదని, ముందస్తు అనుమతితోనే తాము వచ్చామని వికాస్ సింగ్, అడిషనల్ కమిషనర్ విపిన్ కుమార్ మీడియాకు వివరించారు. ఇదే ఆసుపత్రిలో గతంలో ఒక ఐటీబీపీ మహిళా కానిస్టేబుల్, ఒక ఇన్‌స్పెక్టర్ కూడా వైద్య నిర్లక్ష్యంతో మరణించారని ఐటీబీపీ లైజన్ ఆఫీసర్ అర్పిత్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. కాగా, ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# యువతకు తుంటి తంటాలు

(మొదటి పేజీ తరువాయి)


రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలు దాదాపు 40 శాతం పెరిగాయని వెల్లడించారు. కరోనా సమయంలో వాడిన అధిక మోతాదులో స్టెరాయిడ్లు ఈ సమస్యలకు ప్రధాన కారణమై ఉండొచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ వ్యాధి ఎక్కువగా వృద్ధుల్లో లేదా ప్రమాదాలకు గురైన వారిలో కనిపించేది. కానీ ఇప్పుడు యువ ఉద్యోగులు, ఐటీ రంగంలో పనిచేసేవారు, కరోనా తర్వాత స్టెరాయిడ్ చికిత్స తీసుకున్నవారిలో కూడా ఈ సమస్యలు బయటపడుతున్నాయి. దీని వల్ల పని సామర్థ్యం తగ్గడం, సాధారణ జీవితం దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కరోనా సమయంలో స్టెరాయిడ్లు అనేక మంది ప్రాణాలను కాపాడినప్పటికీ, వాటిని అవసరానికి మించి వాడటం వల్ల దీర్ఘకాలిక సమస్యలు వచ్చాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వైద్యుల సూచన లేకుండా మందులు వాడటం కూడా ఈ ప్రమాదానికి కారణం అని వెల్లడించారు.

**ఏవీఎన్ అంటే ఏమిటి?**

అవాస్క్యులర్ నెక్రోసిస్ అంటే హిప్ ఎముకకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల ఆ ఎముక క్రమంగా దెబ్బతినే పరిస్థితి. మొదట్లో చిన్న నొప్పిగా మొదలయ్యే ఈ సమస్య, తర్వాత నడవలేని స్థితికి తీసుకెళ్తుంది. చాలా మంది దీనిని సాధారణ కండరాల నొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తుండటంతో పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. హిప్ దగ్గర నొప్పి, కాళ్లలో బరువు, నడిచేటప్పుడు ఇబ్బంది, కూర్చుని లేవడంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రారంభ దశలో ఎమ్మారై పరీక్షలు చేస్తే సమస్యను గుర్తించి శస్త్రచికిత్స అవసరం లేకుండా చికిత్స చేయవచ్చని చెబుతున్నారు.

**ఆశ రేపుతున్న లేటెస్ట్ టెక్నాలజీ**

ఇప్పటి ఆధునిక హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలు ఎంతో సురక్షితంగా మారాయని నిపుణులు తెలిపారు. రోబోటిక్ సర్జరీ, కొత్త ఇంప్లాంట్లు, మినిమల్ ఇన్వేసివ్ టెక్నాలజీ వల్ల రోగులు త్వరగా కోలుకుంటున్నారని చెప్పారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే సాధారణ జీవితానికి తిరిగి రావడం సాధ్యమని వివరించారు. కరోనా తర్వాత శరీరంలో వచ్చే మార్పులను చిన్నచూపు చూడకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నిరంతర హిప్ నొప్పి ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. సరైన అవగాహన, సమయానికి చికిత్స, జాగ్రత్తలు తీసుకుంటే యువతలో పెరుగుతున్న ఈ ప్రమాదాన్ని తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



# మేడిగడ్డ కీలక ఫైల్స్ దగ్ధం!

(మొదటి పేజీ తరువాయి)

అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, అప్పటికే మంటలు తీవ్రరూపం దాల్చడంతో కార్యాలయం లోపల ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లతో పాటు కీలక సామాగ్రి అంతా కాలిపోయింది. ఈ అగ్నిప్రమాదంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి, దానికి సంబంధించిన డిజైన్లు, నిర్వహణ, వ్యయ ప్రణాళికలకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లు పూర్తిగా కాలి బూడిదైనట్లు విశ్వసనీయ సమాచారం. గత కొంతకాలంగా మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీలు దర్యాప్తు జరుపుతున్న తరుణంలో.. ఈ అగ్నిప్రమాదం జరగడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# బస్సులో భరోసా

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణం లభించనుంది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, ఐపీఎస్ మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా, క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే తమ సంస్థ ప్రథమ కర్తవ్యమని, నిరంతర ధ్యేయమని స్పష్టం చేశారు. 'ఆర్టీసీ బస్సులను నమ్ముకుని రోజూ లక్షలాది మంది మహిళలు, పాఠశాల, కాలేజీ విద్యార్థినులు ప్రయాణిస్తుంటారు. వారి రక్షణ కోసం మేము ప్రత్యేక నిఘా యంత్రాంగాన్ని సిద్ధం చేశాం. బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా బస్సుల్లో వేధింపులకు దిగే పోకిరీల ఆటకట్టించవచ్చు. అలాగే పిక్‌పాకెటింగ్, మొబైల్ దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు' అని ఆయన వివరించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద తొలి విడతగా ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి నడుస్తున్న సుమారు 175 ఆర్టీసీ బస్సులలో ఈ నిఘా కెమెరాలను విజయవంతంగా అమర్చారు. డ్రైవర్ సీటుకు ఎగువన, బస్సు లోపలి భాగం మొత్తం స్పష్టంగా కనిపించేలా ఈ కెమెరాలను అమర్చడం విశేషం. ఈ కెమెరాల ద్వారా బస్సు లోపల ప్రయాణికుల మధ్య జరిగే ప్రతి చిన్న కదలిక, మాటలు డిజిటల్ రూపంలో స్పష్టంగా రికార్డు అవుతాయి. ఈ ప్రాజెక్ట్‌ను కేవలం ఆర్టీసీ మాత్రమే కాకుండా రాష్ట్ర పోలీస్ శాఖ సమన్వయంతో సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. దీనివల్ల బస్సులో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించి కఠిన చర్యలు తీసుకునే వీలుంటుంది. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ బస్సులో భరోసా పైలట్ ప్రాజెక్ట్ క్షేత్రస్థాయి ఫలితాలు, సాంకేతిక పనితీరు, ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ఉన్నతాధికారుల బృందం నిరంతరం పరిశీలిస్తుందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఇక్కడి విజయవంతమైన ఫలితాలను విశ్లేషించిన అనంతరం.. అతి త్వరలోనే ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల పరిధిలోని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, సిటీ బస్సులకు దశలవారీగా విస్తరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి మహిళకు ఈ సీసీ కెమెరాల నిఘా ఒక రక్షణ కవచంలా మారుతుందని, మహిళలు ఎలాంటి భయం లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా

(మొదటి పేజీ తరువాయి)

అతీతంగా, పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని కోటీ 15 లక్షల కుటుంబాలకు ఈ భీమా రక్షణ కవచంలా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు కనీసం లక్ష రూపాయల సాయం కోసం చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని భట్టి విమర్శించారు. అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే, ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన ప్రతి ఇంటికీ ఐదు లక్షల రూపాయల భీమా వర్తింపజేయాలని ప్రాజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనికి సంబంధించి అధికారులు త్వరలోనే ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యాలపై ప్రజలు సరైన సమయంలో బలమైన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డిజిటల్ రూపంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ, ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మంది కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రాబోయే హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడే వారికే టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. గడచిన రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన లక్ష ఇళ్లను పక్కనబెట్టి, రేవంత్ రెడ్డి 'హైడ్రా' పేరుతో వేలాది పేదల ఇళ్లను అడ్డగోలుగా కూలగొట్టారని మండిపడ్డారు. కనీసం నగరంలోని మోరీలు క్లీన్ చేసి, చెత్త ఎత్తే శక్తి లేని మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి.. 'ఫ్యూచర్ సిటీ' పేరుతో గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భవిష్యత్తు లేని ముఖ్యమంత్రి నిర్మించే ఫ్యూచర్ సిటీ మాటలను ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచుకోవడానికి రేవంత్ రెడ్డి పెద్ద ప్రణాళిక వేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎలాంటి విధ్వంసం, ఇళ్ల తొలగింపు లేకుండా మూసీపై ఎస్టీపీల నిర్మాణం, బ్రిడ్జీల పనులను దాదాపుగా పూర్తి చేశామని గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం కాంట్రాక్ట్ కమిషన్ల కోసమే లక్షన్నర కోట్లతో రేవంత్ రెడ్డి కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వేలాది మంది పేదల ఇళ్లను కూలగొట్టి, వారిని రోడ్డున పడేస్తూ మూసీ ప్రక్షాళన చేయడం దుర్మార్గమని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.



# ఆల్చిప్పల కోసం వెళ్లి 8 మంది మృతి


(మొదటి పేజీ తరువాయి)

8 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి ఈ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలూ పొంగిపొర్లాయి. ఈ సమయంలో ఆల్చిప్పలు విరివిగా దొరికే అవకాశం ఉండటంతో సిరాలి అనే ఊరికి చెందిన ఓ కుటుంబం ఆదివారం ఉదయం తట్టేహక్కులు నదిలోకి దిగింది. మొత్తం 14 మంది కుటుంబసభ్యులు ఆల్చిప్పల కోసం నదిలోకి దిగా.. నదీ ప్రవాహం పెరిగి, అందులోని ముగ్గురు కొట్టుకుపోయారు. వీరిని కాపాడే ప్రయత్నంలో మిగతా వారు కూడా నదిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక జాలర్లు వారిని కాపాడే ప్రయత్నం చేశారు. 14 మందిలో ముగ్గురిని కాపాడి వెలుపలికి తీసుకువచ్చారు. ఈలోగా మిగతా 11 మంది నదిలో గల్లంతయ్యారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రానికి ఎనిమిది మృతదేహాలను గుర్తించారు. చనిపోయిన వారిలో ఏడుగురు మహిళలు కాగా.. ఒక పురుషుడు ఉన్నారు. మిగతా ముగ్గురి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వీరికి స్థానిక జాలర్లు కూడా సహాయం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హార్మూజ్ ఓపెన్

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ అణుబాంబులను తయారు చేయగలదని ఇజ్రాయెల్ చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నిల్వలను పూర్తిగా వదులుకోవాలని అమెరికా గట్టిగా పట్టుబట్టడంతో.. రాబోయే 30 నుంచి 60 రోజుల్లో దీనిపై తుది చర్చలు జరపడానికి ఇరాన్ అంగీకరించింది. నిజానికి ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ అణు నిల్వలను దేశం దాటించవద్దని గతంలో కఠిన ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రాథమిక ఒప్పందంలోనే యురేనియంపై హామీ ఇవ్వాలని, లేదంటే చర్చలు నిలిపివేసి మళ్లీ సైనిక దాడులు ప్రారంభిస్తామని అమెరికా హెచ్చరించడంతో ఇరాన్ వెనక్కి తగ్గక తప్పలేదు. ఇరాన్ అణు నిల్వలను అప్పగించని పక్షంలో.. వాటిని పూర్తిగా నాశనం చేయడానికి అమెరికా సైనిక వ్యూహకర్తలు తెరవెనుక భారీ స్కెచ్ వేశారు. ఇస్ఫహాన్ అణు కేంద్రంలోని భూగర్భంలో దాచిన యురేనియం నిల్వలను పేల్చివేయడానికి అత్యంత శక్తివంతమైన 'బంకర్-బస్టర్' బాంబులను ప్రయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేకాకుండా గతంలో అమెరికా జరిపిన టోమాహాక్ క్షిపణి దాడుల తర్వాత ఇరాన్ తిరిగి స్వాధీనం చేసుకున్న యురేనియంను



సీజ్ చేయడానికి యూఎస్, ఇజ్రాయెల్ ఉమ్మడి కమాండో ఆపరేషన్‌ను కూడా ట్రంప్ పరిశీలించారు. కానీ భారీ ప్రమాద తీవ్రత దృష్ట్యా ఆ ప్లాన్‌ను పక్కన పెట్టారు. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం.. 2015 నాటి అణు ఒప్పందం తరహాలోనే ఈ యురేనియం నిల్వలను రష్యాకు తరలించడం లేదా దాని రసాయన తీవ్రతను తగ్గించి ఆయుధాలకు పనికి రాకుండా మార్చడం అనే ఆప్షన్లపై చర్చలు జరుగుతున్నాయి. ఈ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు చెందిన బిలియన్ల కొద్దీ డాలర్ల విదేశీ నిధులను విడుదల చేయడానికి అమెరికా అంగీకరించింది. అయితే దేశ పునర్నిర్మాణానికి సంబంధించిన మెజారిటీ నిధులను అణు ఒప్పందం పూర్తిగా ముగిసిన తర్వాతే విడుదల చేస్తామని స్పష్టం చేయడం ద్వారా ఇరాన్ చర్చల నుంచి తప్పుకోకుండా అమెరికా చెక్ పెట్టింది.

# 24 మంది పాక్ సైనికులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

వాహనం వేగంగా దూసుకొచ్చి.. రైలు బోగీని బలంగా ఢీకొట్టింది. వాహనం ఢీకొన్న మరుక్షణమే పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఈ ధాటికి అక్కడి ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. అయితే ఈ పేలుడు వల్ల ఒక్క బోగీ మాత్రమే కాదు.. మరికొన్ని బోగీలు కూడా పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. అంతేకాకుండా రైల్వే స్టేషన్ ఆవరణలో పార్క్ చేసి ఉన్న 10కి పైగా ఇతర వాహనాలు కూడా అగ్నికి పూర్తిగా ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పాక్ రక్షణ బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్ సమీపంలోనే ఈ ప్రమాదం జరగడంతో క్వెట్టా మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. క్వెట్టా నుంచి పెషావర్ వైపు వెళ్లాల్సిన ప్రసిద్ధ 'జాఫర్ ఎక్స్‌ప్రెస్' రైలును భద్రతా కారణాల దృష్ట్యా చమన్ ఫాటక్ స్టేషన్‌లోనే అధికారులు నిలిపివేశారు. ఈ దాడికి తమదే బాధ్యత అని బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది.

# చిట్యాలలో 48.3 డిగ్రీలు




## నిప్పులకొలిమిలా ఆంధ్రప్రదేశ్.

### సోమవారం 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు

**ఆంధ్రప్రదేశ్‌లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాడు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా చిట్యాల వద్ద ఈ సీజన్‌లోనే అత్యధికంగా 48.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు.**

విశాఖపట్నం, మే 24 (ఈవార్తలు): రాబోయే మూడు రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటాయి. తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురంలో 48.3, ఉండ్రాజవరంలో 48.1 డిగ్రీలు నమోదవగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, ఇరగవరం, తణుకులో 48.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోనూ 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరులో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల తీవ్రత కనిపించింది. వీటితో పాటు కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని అనేక మండలాల్లో 44 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో 46.2, కాకినాడ జిల్లా కాజులూరులో 46.5, ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో 45.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సోమవారం (మే 25) కూడా ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలోని 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా కోనసీమ, గోదావరి జిల్లాలు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకు చేరవచ్చని హెచ్చరించింది. విజయనగరం, మన్యం, కాకినాడ, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నా, మరోవైపు ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని హెచ్చరికలు జారీ చేశారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## 700 డ్రోన్లతో అతిపెద్ద దాడి

**ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం**

మాస్కో: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా భీకర దాడి జరిపింది. ఇటీవలి కాలంలో ఉక్రెయిన్.. రష్యా అధీనంలో ఉన్న ప్రాంతాలపై జరిపిన దాడులకు ప్రతీకారంగా మాస్కో ఈ చర్యకు పాల్పడింది. రష్యా ఏకంగా 700 డ్రోన్లు, అత్యంత వేగంగా దూసుకెళ్లే అధునాతన 'ఓరేష్నిక్' హైపర్సోనిక్ క్షిపణులతో సహా 50 కి పైగా క్రూయిజ్ క్షిపణులను కీవ్ నగరంపైకి ప్రయోగించింది. న్యూస్18 ఇంగ్లీష్ కథనం ప్రకారం.. రాత్రి సమయంలో జరిగిన ఘోర దాడిలో కీవ్ పరిసర ప్రాంతాలలో కనీసం నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు ధృవీకరించారు. నివాస భవనాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గిడ్డంగులు ఈ దాడుల్లో తీవ్రంగా ధ్వంసమయ్యాయి. బాంబుల పేలుళ్ల శబ్దాలతో రాజధాని నగరం దద్దరిల్లిపోవడంతో ప్రాణాలు రక్షించుకోవడానికి ప్రజలు మెట్రో స్టేషన్లు, భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందారు. రష్యా అధీనంలో ఉన్న లుహాన్స్క్ ప్రాంతంలోని ఒక విద్యార్థి వసతి గృహంపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో 18 మంది మరణించారని, దానికి ప్రతీకారంగానే ఈ క్షిపణి దాడులు జరిపినట్లు మాస్కో ప్రకటించింది. అయితే తాము పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని, రష్యా డ్రోన్ కమాండ్ సెంటర్‌పైనే దాడి చేశామని ఉక్రెయిన్ స్పష్టం చేసింది. రష్యా ఈ దాడిలో ఓరేష్నిక్, ఇస్కందర్, కింజాల్, జిర్కాన్ వంటి అత్యంత ప్రమాదకరమైన క్షిపణులను ఉపయోగించింది. ఈ భీకర దాడుల నేపథ్యంలో పొరుగునే ఉన్న నాటో సభ్య దేశం పోలాండ్ సరిహద్దు భద్రత కోసం తమ యుద్ధ విమానాలను గాల్లోకి లేపింది.

## జగన్ మళ్లీ సీఎం అవుతారని బాబుకు భయం: అంబటి

తాడేపల్లి, మే 24 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని, దాని నుంచి దృష్టి మళ్లించేందుకే ఏపీ సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

## మరో 3 రోజులు తీవ్ర వడగాలులు

హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణంక కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... దీనికితోడు వడగాలులతో ప్రజలు అక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనెల 26 వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ మంచి ర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో త్రీవ వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెరిపింది. ఈ మేరకు ఈ జిల్లాలకు ఆరెంజె అలర్ట్ జారీ చేసింది. రాత్రిపూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 30 డిగ్రీల మేర ఉంటాయని వివరించింది. శని వారం రాష్ట్రంలో అత్యవరంగా ధర్మపురి



మండలం బుద్ధిశపల్లిలో 48.3 డిగ్రీల సెల్సియస్ ఇష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రం. లోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు చురుకుగా నైరుతి రుతుపవనాలు నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులు శీలిస్తే గరిష్ఠ ఉష్ణోగ్రత అమ్మంలో 44.8 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలలోకి విస్తరించమన్నాయి. ఈనెల 26న కేరళలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతా వరణ శాఖ తెలిపింది. నైరుతి బిహార్, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్ర వాహత ఆవర్తనం శనివారం జార్ఖండ్ ఉత్తర రత్తీస్ గఢ్, ఒడిశాల మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. అది, సోమవారాల్లో రాష్ట్రంలోని తూర్పు ఉత్తర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్గాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

## మోదీ అంటే చాలా ఇష్టం: ట్రంప్



న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ దేశ 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఒక ఆసక్తికరమైన ఘట్టం చోటుచేసుకుంది. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ వేడుకల మధ్యలో అకస్మాత్తుగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి స్పీకర్ ఆన్‌లో పెట్టారు. రాయబారులు, ఉన్నతాధికారులు, వ్యాపార ప్రముఖులతో కిక్కిరిసి ఉన్న సభను ఉద్దేశించి ట్రంప్ ఫోన్ లో మాట్లాడుతూ, భారత్ దేశం పట్ల, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తనకున్న అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు. తాను భారత్‌ను, ప్రధాని మోదీని ఎంతగానో ప్రేమిస్తున్నానని ట్రంప్ ప్రకటించడంతో సభలో ఒక్కసారిగా చప్పట్లు మిన్నంటాయి. భారత్ ఎప్పుడైనా, ఎలాంటి సహాయం కోరినా 100 శాతం అండగా ఉంటానని, తమకు సహాయం కావాలన్నప్పుడు ఎక్కడికి ఫోన్ చేయాలో దిల్లీకి బాగా తెలుసని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం రికార్డు స్థాయి లాభాలతో దూసుకుపోతోందని, స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. భారత్ కు ఏది కావాలన్నా అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ వేడుకలలో పాల్గొన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను దేశ చరిత్రలోనే అత్యంత గొప్ప విదేశాంగ మంత్రిగా ట్రంప్ అభివర్ణించారు. ప్రధాని మోదీకి తన తరఫున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేయాలని రాయబారి గోర్‌కు సూచించారు. తామిద్దరం ఎప్పుడు మాట్లాడుకున్నా ప్రధాని మోదీ క్షేమసమాచారాల గురించే ట్రంప్ మొదట అడుగుతారని రాయబారి సెర్గియో గోర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్-అమెరికా భాగస్వామ్యం ట్రంప్, మోదీల వ్యక్తిగత బంధం వల్ల సరికొత్త ఎత్తుకు చేరుకుందని రాయబారి గోర్ కొనియాడారు. అమెరికా ఫస్ట్ అంటే అమెరికా ఒంటరిగా ఉండటం కాదని, రెండు దేశాలకు లబ్ధి చేకూర్చే అంశాలపై తాము కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. తాను దిల్లీకి వచ్చి ఐదు నెలలు మాత్రమే అవుతోందని, ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం రాబోయే కొన్ని వారాల్లోనే అధికారికంగా ఖరారు కానుందని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ ఒప్పందం ద్వారా రెండు దేశాల్లో పెట్టుబడులు పెరిగి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తడిసినా ధాన్యం కొనాల్సిందే

**అధికారులకు ఉత్తమ్ ఆదేశాలు**



హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): తాలు, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తే మిల్లర్లు, కొనుగోలు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఆదివారం హైదరాబాద్‌లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఆది శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకు రూ.8,749 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 21 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, కొరత ఉందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు. రబీ సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్టు మంత్రి వెల్లడించారు. తాజా అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండగా, ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేస్తోందని, మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## జొన్న, మొక్కజొన్న రైతులకు సర్కారు తీపికబురు

హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ.4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

## నేటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా'

హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు ఎత్తేయాలి

**ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి**

హైదరాబాద్, మే 24 (ఈవార్తలు): జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

# రక్తమోడిన బలూచ్

**కారు బాంబుతో పాక్ సైనికుల రైలుపై దాడి**

**24 మంది మృతి.. మా పనే: బీఎల్ఏ**

క్వెట్టా: పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

## కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మొద్దు: ఉదయనిధి


చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవలి ఎన్నికల తర్వాత నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో, డీఎంకే కూటమిలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్, కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌ను 'వెన్నుపోటుదారు' అని అభివర్ణిస్తూ, ఆ పార్టీని ఇకపై ఎప్పటికీ నమ్మవద్దని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఒక పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ఉదయనిధి, "ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వం, డీఎంకే కార్యకర్తల కృషితోనే కాంగ్రెస్ ఐదుగురు ఎమ్మెల్యేలను గెలుచుకుంది. కానీ ఈ రోజు కనీస కృతజ్ఞత, పద్ధతి లేకుండా పదవుల కోసం మాకు చెప్పకుండానే వెళ్లిపోయారు. ఇలాంటి కాంగ్రెస్‌ను మనం ఎప్పటికీ నమ్మకూడదు, మన దరిదాపులకు కూడా రానివ్వకూడదు. తమిళనాడు ప్రజలు త్వరలోనే వారికి తగిన గుణపాఠం చెబుతారు" అని తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా బీజేపీ విజయానికి ప్రధాని మోదీ, అమిత్ షా కారణమని తాను భావించానని, కానీ వాస్తవానికి కాంగ్రెస్ పార్టీయే బీజేపీ ఎదుగుదలకు అసలు కారణమని ఇప్పుడు స్పష్టమైందని ఉదయనిధి ఆరోపించారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తమ నేత ఎంకే స్టాలిన్ కాంగ్రెస్‌ను తన భుజాలపై మోశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌ను "వెన్నుపోటుదారులు", "మిత్రపక్షాల శ్రమపై బతికే జలగలు" అని అభివర్ణిస్తూ డీఎంకే తీర్మానాలు కూడా ఆమోదించింది.

## బొద్దింకలకే భయపడుతున్నారా?

**కేంద్రంపై విజయన్ ఎద్దేవా**

తిరువనంతపురం: 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కు పెరుగుతున్న ప్రజాదరణ చూసి బీజేపీ భయపడుతోందని కేరళ ప్రతిపక్ష నేత పినరయి విజయన్ ఆరోపించారు. ప్రజాస్వామ్య నిరసనలపై కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. యువ కార్యకర్త అభిజీత్ దిప్కే స్థాపించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' అతి తక్కువ కాలంలోనే సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. కొన్ని వేదికల్లో అధికార బీజేపీ కంటే ఈ సంస్థకే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే సీజేపీకి చెందిన ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయడం, చివరకు వ్యవస్థాపకుడు అభిజీత్ వ్యక్తిగత ఖాతాను కూడా సస్పెండ్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తమను 'బొద్దింకలు'గా పిలుచుకుంటూ చేపట్టిన ఈ నిరసనను కేవలం ఒక సాధారణ స్పందనగా కొట్టిపారేయకూడదని పినరయి విజయన్ పేర్కొన్నారు. తన ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా స్పందించిన ఆయన, కేంద్రం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణిని ఎండగట్టారు. ఇలాంటి వ్యంగ్య రాజకీయ ప్రయోగాలను చూసి అధికార పక్షం కంగారు పడటం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన హెచ్చరించారు.

# 2 నెలలు హార్ముజ్ ఓపెన్: ఇరాన్




టెహ్రాన్: దీర్ఘకాలంగా ఇరాన్-అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణానికి తెరదించే దిశగా ఒక కీలకమైన ముసాయిదా ఒప్పందం తుది దశకు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వివిధ మధ్యవర్తిత్వ దేశాల ప్రమేయంతో ఈ 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం దాదాపు ఖరారైనట్లు ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని 60 రోజుల పాటు ఎలాంటి పన్నులు లేకుండా స్వేచ్ఛా నౌకాయానం కోసం తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. ఇందులో భాగంగా జలసంధిలో తాము అమర్చిన మందుపాతరలను తొలగించేందుకు ఇరాన్ సమ్మతించింది. దానికి ప్రతిగా, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయనున్నారు. దీనివల్ల ఇరాన్ ప్రపంచ దేశాలకు మళ్లీ స్వేచ్ఛగా చమురు విక్రయించుకునే వీలు కలుగుతుంది. ఈ 60 రోజుల కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ తన అణు కార్యక్రమాలను నిలిపివేయడం, యురేనియం ఎన్రిచ్మెంట్ ను పరిమితం చేయడం, తన వద్ద ఉన్న నిల్వలను వదులుకోవడం వంటి అంశాలపై ఇరుదేశాల మధ్య లోతైన చర్చలు జరగనున్నాయి. అయితే, ఇరాన్ ప్రాథమికంగా వీటికి సంబంధించి కొన్ని మౌఖిక హామీలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా, దాని మిత్రదేశాలు ఇరాన్‌పై ఎలాంటి దాడులు చేయకూడదు. అదేవిధంగా ఇరాన్ కూడా అమెరికా లేదా దాని మిత్రపక్షాలపై ముందస్తు దాడులకు దిగకూడదనే నిబంధనను చేర్చారు. ఈ శాంతి ప్రక్రియలో భాగంగా ఖతార్ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్‌కు చెందిన 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.55 వేల కోట్లు) ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు సమాచారం. అంతేకాకుండా, లెబనాన్‌లో (ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య) కాల్పుల విరమణ అంశం కూడా ఈ చర్చల పరిధిలో భాగమైనట్లు తెలుస్తోంది. ఈ 60 రోజుల తాత్కాలిక వ్యవధిలో ఆర్థిక ఉపశమనం అనేది ఇరాన్ పై ఆధారపడి ఉంటుందని అమెరికా స్పష్టం చేసింది. ప్రస్తుతం ప్రాంతీయ రక్షణ కోసం మోహరించిన అమెరికా సైనిక దళాలు ఇప్పుడే వెనక్కి వెళ్లవని, ఇరుదేశాల మధ్య పూర్తి స్థాయి తుది ఒప్పందం కుదిరి, అది పూర్తిగా నిరూపితమైన తర్వాతే తమ బలగాల ఉపసంహరణ ఉంటుందని వాషింగ్టన్ అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. కాగా ఈ చర్చల మధ్యవర్తిత్వంలో పాకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాలు కీలక పాత్ర పోషించాయి. ఈ ఒప్పందం కనుక విజయవంతంగా అమలైతే ప్రపంచ మార్కెట్లో చమురు సంక్షోభం తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట లభించనుంది.

## ప్రధాన్ రాజీనామా చేసేవరకు నిరసనలు

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరిక**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో ఉండగా ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆదివారం ఎక్స్‌లో ఈ మేరకు రాహుల్ గాంధీ ఎన్ఎస్‌యూఐ నిరసన తెలిపిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. "లక్షలాది మంది యువత రోడ్లపై ఉన్నారు.. 22 లక్షల పిల్లల భవిష్యత్ ఏంటో తెలియట్లేదు. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారు. ఈ ప్రభుత్వం సమాధానం చెప్పడంపై కాదు, బాధ్యత నుంచి తప్పించుకోవడంపైనే దృష్టి పెట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, నీట్ లాంటి ప్రశ్నపత్ర లీకులు ఆగేలా పూర్తిస్థాయి భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసే వరకు మేము ఆగము" అని రాహుల్ గాంధీ అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడటంలో ప్రధాని మోదీ ప్రభుత్వం విఫలమైందని, "ప్రశ్నపత్ర లీక్ మాఫియా" పెరగడానికి అవకాశం ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎక్స్‌లో కాంగ్రెస్ ట్వీట్ చేస్తూ.. "నీట్ ప్రశ్నపత్ర లీక్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను చీకటిలోకి నెట్టింది. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రశ్నపత్ర లీక్ మాఫియా విస్తరిస్తోంది. బాధ్యులు మాత్రం మౌనంగా చూస్తున్నారు. హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ నాయకత్వంలో కార్యకర్తలు పాదయాత్ర చేపట్టి, యువత వ్యతిరేక మోదీ ప్రభుత్వానికి గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌తో చేసే ఈ చెలగాటాన్ని ఏ మాత్రం సహించం. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ప్రశ్నపత్ర లీక్ కేసులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. నీట్ ప్రశ్నపత్ర లీక్ అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారులు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ అక్రమాల్లో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీవీకే రేపో మాపో కూలిపోతుంది

**డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్**



చెన్నై: తమిళనాడులో రాజకీయం వేడెక్కింది. టీవీకే విజయ్ ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వం పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేయలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం కేవలం డీఎంకే దయతోనే నడుస్తోందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాన్ని స్టాలిన్ ఒక రాజకీయ పవనంగా కాకుండా 'సినిమా సునామీ'గా అభివర్ణించారు. ఓటర్లు రాజకీయ విశ్వాసంతో కాకుండా, ఒక ప్రముఖ సినీ నటుడిపై ఉన్న ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు ఇచ్చారని ఆయన వాదించారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆదివారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ..'తమ అభిమాన నటుడు విజయ్ ఒక పార్టీని ప్రారంభించాడనే ఉత్సాహంతో ప్రజలు ఓటు వేశారు. కొద్ది రోజుల్లోనే ఈ ఆటబొమ్మపై వారికి ఆసక్తి పోతుంది. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్లే, ఓటర్లు చివరికి మళ్లీ డీఎంకే కోసం వెతుకుతారు' అని జోస్యం చెప్పారు. అలాగే, టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి స్థిరత్వం లేదు. విజయ్ పార్టీ సొంతంగా 118 సీట్ల మెజారిటీ మార్కును దాటడంలో విఫలమైంది. వారు కనీసం మెజారిటీ కూడా సాధించలేకపోయారు. తమిళనాడు ప్రభుత్వం మా దయ వల్లే మనుగడ సాగిస్తోంది. ఏ క్షణంలోనైనా, ఏ రోజైనా అది కూలిపోవచ్చు. ఏం జరుగుతుందో వేచి చూద్దాం. కచ్చితంగా ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగదు' అంటూ బాంబు పేల్చారు. ఇదే సమయంలో అన్నాడీఎంకే రాజకీయాలను ప్రస్తావిస్తూ.. అన్నాడీఎంకేను చీల్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ, అవన్నీ విఫలమయ్యాయని స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ పరిస్థితి అస్థిరంగా ఉందని పేర్కొన్నారు. మిత్రపక్షాలకు మద్దతు ఇవ్వడం గురించి ప్రస్తావిస్తూ, కమ్యూనిస్టు పార్టీలు, విదుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) వంటి పార్టీలు మొదట్లో టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మాత్రమే మద్దతు ఇచ్చాయి. కానీ, ఆ తర్వాత మంత్రివర్గంలో చేరాయని ఆయన పేర్కొన్నారు.

## అభిజిత్ దిప్కే ఇంటికి పోలీసుల పహారా

ముంబై: కాక్రోచ్ జనతా పార్టీ. సోషల్ మీడియా వేదికగా పుట్టుకొచ్చి కేవలం ఒక వారం వ్యవధిలోనే ప్రధాన పార్టీల సోషల్ మీడియా సభ్యత్వాన్ని దాటి రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే నివాసానికి పోలీసులు భద్రత కల్పించారు. అతని నివాసం వద్ద అవాంచనీయ ఘటనలు జరగకుండా నిరంతరం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. నిరుద్యోగం, పరీక్ష పత్రాల లీకేజీలు, విద్యా సంబంధిత సమస్యలపై మీమ్స్,రాజకీయ వ్యాఖ్యానాల ద్వారా గతవారం సోషల్‌మీడియాలో పురుడుపోసుకున్న కాక్రోచ్ జనతా పార్టీ కొద్ది రోజుల్లోనే రెండుకోట్లకు పైగా ఫాలోవర్స్‌ను దాటిపోయింది. సీజేఐ ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన వాఖ్యల నేపథ్యంలో ఈ పార్టీ ఆవిర్భావం జరిగింది. అయితే దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతాపార్టీ సంచలనం సృష్టిస్తున్ననేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ఇంటికి పోలీసులు రక్షణ కల్పించారు. అతని నివాసం వద్ద రద్దీ లేకుండా చూసేందుకు, ఎంఐడీసీ వాలుజ్ ప్రాంతంలోని ఆయన నివాసానికి తాము ఇరవై నాలుగు గంటల సాధారణ పోలీసు భద్రతను కల్పించామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పంకజ్ అతుల్కర్ తెలిపారు. అంతేకాని ఎటువంటి బెదిరింపులు దీనికి కారణం కాదని పేర్కొన్నారు. కాగా కాక్రోచ్ జనతా పార్టీకి పాకిస్థాన్, బిలియనీర్ జార్జ్ సోరోస్ నెట్‌వర్క్‌ల నుంచి మద్దతు లభిస్తోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ ఆరోపణలను కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఖండించారు. మా పార్టీకి పాకిస్థాన్‌తో ఎలాంటి సంబంధం లేదు. కేంద్రమంత్రి చేసిన ఆరోపణలు నిరాదారమైనవన్నారు. పార్టీ ఉద్దేశ్యం కేవలం భారతీయ ప్రజల సమస్యలను వినిపించడం, యువతలో అవగాహన పెంచడమేనని స్పష్టం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీకి కేవలం భారత్‌లోనే 94శాతం మంది ఫాలోవర్స్ ఉన్నారని తెలిపారు.

## ఎల్ఐసీకి లాభాల పంట

ముంబై: భారత ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఎల్ఐసీ ఏకంగా రూ.23,420 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.19,013 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 23 శాతం వృద్ధి కావడం గమనార్హం. ఈ అద్భుతమైన ప్రదర్శనతో అటు ప్రభుత్వరంగ సంస్థలలోనే కాకుండా, ఇటు దేశీయ ఫైనాన్షియల్ సెక్టార్‌లోనే త్రైమాసిక ప్రాతిపదికన అత్యధిక లాభాలు గడించిన నంబర్ వన్ కంపెనీగా ఎల్ఐసీ అవతరించింది. బ్యాంకింగ్ దిగ్గజాలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.19,684 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.19,221 కోట్ల నికర లాభాలతో క్యూ4 రేసులో ఎల్ఐసీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అయితే, త్రైమాసిక లాభాల్లో ఎల్ఐసీ టాప్‌లో నిలిచినప్పటికీ, పూర్తి ఆర్థిక సంవత్సర వార్షిక లాభాల పరంగా మాత్రం ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు ఎల్ఐసీని అధిగమించాయి.



# ప్రతి గింజా కొంటాం

**రైతులు ఆందోళన చెందవద్దు.. మరో 10 రోజుల్లో కొనుగోళ్లు పూర్తి.. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, మే 24 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, మిగిలిన కొనుగోళ్లను మరో 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పౌరసరఫరాల శాఖ గౌరవ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా శాఖ గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష, అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 75 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగా, మిగిలిన కొనుగోళ్లను కూడా వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 68 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ కొనుగోళ్ల విలువ రూ.544.74 కోట్లు కాగా, రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.407.21 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మిగతా అమౌంటు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. మరో 10 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాల వారీగా మిగిలిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిగిలిన ప్రక్రియను మరో 10 రోజుల్లో విజయ వంతంగా పూర్తి చేయడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

# పల్లెపల్లెకు బీజేపీ

**టీజీ సంఘటన మహామంత్రి చంద్రశేఖర్**

**ముగిసిన ప్రశిక్షణ మహా అభియాన్**

**పాల్గొన్న భోగ శ్రావణి తదితరులు**



జగిత్యాల, మే 24 (ఈవార్తలు): గ్రామ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటన మహామంత్రి చంద్రశేఖర్ సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026 జిల్లా స్థాయి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భోగ శ్రావణి ఆయనతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని సూచించారు. దేశాభివృద్ధి, సమాజ సేవలో పార్టీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండి పని చేయాలని, పార్టీకి బలమైన నాయకత్వాన్ని గ్రామ స్థాయి నుంచి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహనతో ప్రజలకు చేరువ కావాలని సూచించారు. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా కార్యకర్తలు మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యదర్శి భారత్, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్, అభియాన్ ఇన్‌చార్జ్ రంజిత్ మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుపు రావు, పుదరి అరుణ, రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్‌తో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి

ధర్మపురి, మే 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లింగం అక్షయ్ (20) వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. అక్షయ్ డిగ్రీ చదువును మధ్యలోనే నిలిపివేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. వేసవి సెలవుల సందర్భంగా తన అమ్మమ్మ ఊరు అయిన కోరండ్లపల్లికి వెళ్లాడు. ఈ నెల 24న మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో స్నేహితులతో కలిసి కోరండ్లపల్లి చెరువు సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ సందర్భంగా ఈత కొడుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి లింగం లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సబ్ ఇన్స్పెక్టర్ జి. మహేష్ తెలిపారు.

## మహిళా వారోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్, మే 24 (ఈవార్తలు: సోమవారం నుంచి జరగనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను జిల్లాలో అధికారులు అద్భుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోజువారి ప్లాన్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మహిళా శిశు సంక్షేమ డి ఆర్ డి ఓ మెప్మా అధికారులతో పాటు ఇతర అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు పౌరసరఫరాల డిఎం రజనీకాంత్ వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి, మహిళా సంక్షేమ అధికారి సరస్వతి డి ఆర్ డి ఓ గీత మెప్మా పీడీ స్వరూప రాణి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




## రైతుల కోసం రంగంలోకి సత్యం

**లారీలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన చొప్పదండి ఎమ్మెల్యే**

గంగాధర, మే 24 (ఈవార్తలు): కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. ఇచ్చిన హామీని మర్చిపోకుండా కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం లారీల కొరతతో మిల్లులకు తరలించడం ఇబ్బందిగా మారింది. రైతుల ఇబ్బందులను గ్రహించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వారి ఇబ్బందులను తీర్చడానికి స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాకు సమీపంలో కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై వెళుతున్న లారీలను మంగపేట చెక్‌పోస్ట్ వద్ద ఎమ్మెల్యే ఆపారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలింపుకు సహకరించాలని లారీల యజమానులతో మాట్లాడారు. అంతేకాకుండా తానే లారీలో కూర్చుని స్వయంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లారు. లారీ లోడింగ్ తర్వాత మిల్లులకు తరలించిన వెంటనే అన్లోడ్ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా నిత్యం చొప్పదండి నియోజకవర్గం లోని కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తూ రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తొలగిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.



## కొండగట్టు ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, మే 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. తాగునీరు, క్యూలైన్లు, ప్రసాద పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రద్దీ దృష్ట్యా పోలీసు సిబ్బంది భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.



## కండ్ల డాక్టర్ ఎమ్మెల్యే సంజయ్

**సేవలో ఆదర్శం.. శస్త్రచికిత్సల్లో ప్రత్యేక గుర్తింపు**

**జగిత్యాల ఎమ్మెల్యేకు హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు**

హైదరాబాద్/జగిత్యాల, మే 24 (ఈవార్తలు): జగిత్యాల, ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే వైద్య వృత్తి ధర్మాన్ని మరువకుండా సేవలను కొనసాగిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మరోసారి గుర్తింపు పొందారు. నేత్ర వైద్య నిపుణుడిగా వేలాది మందికి చూపును ప్రసాదిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయనకు 'హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు' లభించింది. డాక్టర్ సంజయ్ కుమార్ 1989లో విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేయగా, 1992లో కర్ణాటకలోని జేజేఎం మెడికల్ కాలేజీలో ఎంఎస్ (ఆప్తమాలజీ) పూర్తి చేశారు. అనంతరం మెట్‌పల్లిలో వైద్య సేవలు ప్రారంభించి, ప్రస్తుతం జగిత్యాలలో 'పావని కంటి ఆసుపత్రి' నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధిగా ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ వైద్య సేవలకు సమయం కేటాయిస్తూ ప్రతిరోజూ 10 నుంచి 20 వరకు కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని సమాచారం. ఇప్పటివరకు లక్షకు పైగా శస్త్రచికిత్సలు నిర్వహించి వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పేద రోగులకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయడం ద్వారా అనేక కుటుంబాల్లో వెలుగు నింపుతున్నారు. 2014లో రాజకీయాల్లోకి ప్రవేశించిన డాక్టర్ సంజయ్ కుమార్, 2018లో జగిత్యాల ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సేవ కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ వైద్య సేవలను కొనసాగిస్తూ ప్రజలకు చేరువ కావడంతో స్థానికంగా 'డాక్టర్ ఎమ్మెల్యే'గా గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన జీ తెలుగు న్యూస్ సంస్థ 'హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు'ను ప్రకటించింది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి . కిషన్ రెడ్డి , రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు.




## మెట్‌పల్లి మండలంలో జువ్వాడి పర్యటన

మెట్‌పల్లి, మే 24 (ఈవార్తలు): మెట్‌పల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం వల్ల ఈతవనం కాలిపోగా ఆదివారం గ్రామస్తులతో కలిసి ఈతవనాన్ని పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కొరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి జరిగిన ప్రమాదం గురించి వివరించి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందేలా అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారని జువ్వాడి నర్సింగరావు తెలిపారు. అనంతరం మెట్ పల్లి మండలం కొండ్రికర్ల గ్రామ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకులు ఎన్నికల్లో గెలుపు కొరకు బ్రిడ్జి నిర్మాణం చేస్తామని బాండ్ పేపర్ రాసి ఇచ్చి మాట తప్పారని అలాంటి మాట తప్పే సాంస్కృతి మాకు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తుందన్నారు. కొండ్రికర్ల ప్రజల దశాబ్దాల కోరిక ఈ బ్రిడ్జి నిర్మాణం అని దీనిని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అనంతరం మెట్పల్లి మండలం కొనరావుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం వల్ల ఈత వనం కాలిపోగా, ఆ ఈతవనాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం మెట్ పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో కొండస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో టీవీకే పోటీ?

చెన్నై/బెంగళూరు: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (బీబీఎంపీ) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు.

వయ్యారి చిత్రం



మాళవిక శర్మ



# మసకబారుతున్న చిన్న తెరలు

తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల వసూళ్లతో రికార్డులు సృష్టిస్తోంది. కానీ, ఆ సినిమాను సామాన్యుడికి చేర్చే క్షేత్రస్థాయి వేదికలైన చిన్న థియేటర్ల పరిస్థితి మాత్రం రోజురోజుకూ దిగజారిపోతోంది. ముఖ్యంగా తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ ఎగ్జిబిటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తుతం సినీ పరిశ్రమలోని తీవ్ర అసమానతలను కళ్లకు కడుతున్నాయి. పెద్ద పెట్టుబడులు, మితిమీరిన వాణిజ్యీకరణ మధ్య చిన్న థియేటర్ల మనుగడ అగమ్యగోచరంగా మారింది.

(ఈవార్తలు-వినోదవాణి)

ఈ వ్యవస్థను కాపాడుకోకపోతే భవిష్యత్తులో సామాన్యుడికి సినిమా వినోదం భారంగా మారడం ఖాయం. పరిశ్రమలో ప్రస్తుతం నడుస్తున్న ధోరణి చిన్న థియేటర్లను పూర్తిగా అణచివేసేలా ఉంది. పెద్ద సినిమాలు వచ్చినప్పుడు టికెట్ రేట్లను భారీగా పెంచుకునే వెసులుబాటును మల్టీప్లెక్స్‌లు, పెద్ద థియేటర్లు పూర్తిగా వాడుకుంటూ లాభాలు గడిస్తున్నాయి. కేవలం టికెట్ ధరలే కాకుండా, లోపల విక్రయించే తినుబండారాలు (పాప్‌కార్న్, వాటర్ బాటిల్స్ వంటివి) సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి. అసలు టికెట్ ధర కంటే ఐదు రెట్లు ఎక్కువగా తినుబండారాల రేట్లు పెంచి దోచుకుంటున్నారనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి.

మరోవైపు, ఎగ్జిబిటర్లను వేధిస్తున్న ప్రధాన సమస్య 'రెంటల్ (అద్దె) విధానం'. సినిమా ఆడినా ఆడకపోయినా డిస్ట్రిబ్యూటర్లకు భారీ మొత్తంలో స్థిరమైన అద్దెలు చెల్లించాల్సి రావడం చిన్న థియేటర్ల నిర్వాహకులకు ఊపిరాడకుండా చేస్తోంది. దీనికి తోడు కనీస విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు, స్థానిక పన్నుల భారం తోడై థియేటర్లను నడపడం కంటే మూసివేయడమే మేలనే స్థితికి వారు వచ్చారు. ఈ భారీ లాభాలు, సదుపాయాలు పెద్ద థియేటర్లకు రక్షణ కవచంగా మారుతుంటే, ఆ స్థాయి ఖర్చు పెట్టలేని చిన్న థియేటర్లు క్రమంగా మూతపడుతున్నాయి. సినిమా రంగం కేవలం కొద్దిమంది అగ్ర నిర్మాతలు, హీరోలు, మల్టీప్లెక్స్ అధినేతలది మాత్రమే కాదు. వేలాది మంది కార్మికులు, చిన్న ఎగ్జిబిటర్ల జీవితాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. చిన్న థియేటర్లు మూతపడితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రేక్షకులకు వినోదం దూరమవుతుంది. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం, ఫిల్మ్ ఛాంబర్ వెంటనే జోక్యం చేసుకొని చర్యలు చేపట్టాలి. చిత్రసీమకు అసలైన బలమైన పునాదిగా ఉన్న సింగిల్ స్క్రీన్లు బతికితేనే సామాన్యుడికి వినోదం అందుబాటులో ఉంటుంది.




### ఎగ్జిబిటర్లు, సినీ ప్రేక్షకుల డిమాండ్లు:

**రెంటల్ విధానంలో మార్పు:** సినిమా వసూళ్ల ఆధారంగా మాత్రమే షేరింగ్ (పర్సంటేజ్) పద్ధతిని ప్రవేశపెట్టాలి. నష్టాలు వస్తే కేవలం ఎగ్జిబిటర్ పైనే భారం పడే స్థిర అద్దె విధానాన్ని రద్దు చేయాలి.

**విద్యుత్ రాయితీలు:** థియేటర్లను పరిశ్రమలుగా గుర్తించి, వీటికి వాణిజ్య (కమర్షియల్) కరెంట్ ఛార్జీల నుండి మినహాయింపు ఇచ్చి రాయితీ అందించాలి.

**క్యాంటీన్ ధరల నియంత్రణ:** మల్టీప్లెక్స్‌లు, పెద్ద థియేటర్లలో తినుబండారాల ధరలపై గరిష్ట ధర పరిమితి నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.

**చిన్న సినిమాలకు రక్షణ:** చిన్న థియేటర్లలో చిన్న బడ్జెట్ సినిమాలకు ప్రత్యేక షోలు, తక్కువ పన్నుల విధింపు వంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.



# ఎగ్జిబిటర్లపై నట్టి కుమార్ ఫైర్

థియేటర్లలో పర్సంటేజ్ విధానాన్ని నిర్మాతలు అంగీకరిస్తేనే సినిమాను ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రముఖ నిర్మాత నట్టి కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిలిం ఛాంబర్ సమావేశం అనంతరం అత్యవసర మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎగ్జిబిటర్ల వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో జరిగిన సబ్ కమిటీ సమావేశంలో పరిశ్రమ పెద్దలు, నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఆ సమావేశంలో ప్రముఖ నిర్మాతలు, పరిశ్రమ పెద్దలు సినిమా విడుదల సాఫీగా జరుగుతుందని స్పష్టంగా చెప్పారని నట్టి కుమార్ పేర్కొన్నారు. అందరూ ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఇప్పుడు మళ్లీ కొత్త అంశాలను తెరపైకి తీసుకురావడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలపై పదేపదే మార్పులు చేయడం పరిశ్రమకు మంచిది కాదన్నారు. అలాగే ఈ వ్యవహారం వెనుక కొంతమంది ప్రభావశీల వ్యక్తులు ఉన్నారంటూ ఆయన ఆరోపించారు.

## 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ 'కర'

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన తాజా రూరల్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'కర' (ఖుతీఖు) థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ (చీవ్‌టశ్రీఱఞ) ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. మే 28 (2026) నుండి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండబోతుంది. మమితా బైజు (మలయాళ 'ప్రేమలు' ఫేమ్) ఇందులో కథానాయికగా నటించగా.. కేఎస్ రవికుమార్, జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించాడు.







## టినీ టామ్తన వేధించాడు: అన్సీబా

మలయాళ ఇండస్ట్రీలో వివాదాలు రోజురోజుకూ మరింత ముదురుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక అనంతరం ఇండస్ట్రీలోని విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండగా.. తాజాగా బ్లాక్‌బస్టర్ ఫ్రాంచైజీ 'దృశ్యం' ఫేమ్ నటి అన్సీబా హాసన్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. మలయాళ నటీనటుల సంఘం 'అమ్మ' లో జాయింట్ సెక్రటరీగా పనిచేసిన అన్సీబా, ఫిబ్రవరిలోనే తన పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా ఆమె మీడియా ముందుకు వచ్చి తాను రాజీనామా చేయడానికి గల అసలు కారణాలను బయటపెట్టారు. సహనటుడు టినీ టామ్తనపై వ్యక్తిగతంగా, మతపరంగా తీవ్రమైన వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించారు. "నన్ను ఇండస్ట్రీలో 'జిహాదీ' అని పిలుస్తూ తప్పుడు ప్రచారం చేశారు. నేను మత మార్పిడులకు పాల్పడుతున్నానంటూ లేనిపోని రూమర్లు సృష్టించారు." అని అన్సీబా ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితంపై, క్యారెక్టర్‌పై అసోసియేషన్ సభ్యులే తప్పుడు కథనాలు అల్లారని, ఒక ముస్లిం మహిళ అయినందుకే తనను ఇలా టార్గెట్ చేశారా? అని ఆమె ప్రశ్నించారు.

## యూకేలో పెద్ది టికెట్లు సేల్ అవుట్

రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రంపై ప్రస్తుతం ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అయ్యి చాలా రోజులవుతోంది. ఓవర్సీస్‌లో ఈ మూవీ బుకింగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ లభిస్తోంది. ఈ చిత్రాన్ని యూకే, ఐర్లాండ్‌లో ప్రత్యాంగిరా సినిమాస్ సంస్థ భారీ స్థాయిలో విడుదల చేయనుంది. ఇందుకోసం ఇప్పటికే అక్కడ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఇక యూకేలో 'పెద్ది' ప్రీమియర్స్‌కు సాలిడ్ రెస్పాన్స్ దక్కుతోంది. తాజాగా మూవీ టీమ్ యూకే ప్రీమియర్స్‌కు సంబంధించిన 10 వేలకుపైగా టికెట్లు సేల్ అయినట్లు అధికారికంగా ప్రకటించింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండగానే ఈ స్థాయిలో బుకింగ్స్ జరగడం విశేషంగా మారింది. ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండటంతో రాబోయే రోజుల్లో పెద్ద స్థాయిలో టికెట్లు సేల్ అయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. దాంతో 'పెద్ది' ఓవర్సీస్‌లో సరికొత్త రికార్డుల వైపు దూసుకెళ్తోందని మెగా అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు.




## పనిమనుషుల కోసం సోనమ్ 51 కోట్ల ఫ్లాట్

బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ జంట ఇప్పటికే లండన్‌లోని నాటింగ్ హిల్స్ ప్రాంతంలో సుమారు రూ. 270 కోట్ల విలువైన భారీ బంగ్లాను కొనుగోలు చేసి, దాన్ని రీ-డెవలప్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే, తాజాగా అదే ప్రాంతంలో మరో రూ. 51 కోట్ల ఖర్చుతో ఐదు ఫ్లాట్లను కొనుగోలు చేశారట. ఈ ఫ్లాట్లను వారు తమ సెక్యూరిటీ, వంట మనుషులు, ఇతర గృహ సిబ్బంది నివాసం కోసం కేటాయించారనే వార్త బయటకు రావడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. "బిలియనీర్లు మా ప్రశాంతమైన నివాస ప్రాంతాన్ని తమకు నచ్చినట్లు మార్చేస్తున్నారు" అని స్థానికులు కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ భారీ మార్పులు చేస్తున్నారని, తాము దీనిపై అభ్యంతరం చెబితే బెదిరింపులు కూడా వస్తున్నాయని కొందరు ఆరోపించారు.



## 'రౌడీ జనార్ధన'తో ప్రీతి ముకుందర్ ఐటం సాంగ్

టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో మాస్ ఆడియన్స్‌ను ఊపేసే ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ ఉండబోతోందట. దర్శకుడు రవి కిరణ్ ఈ పాట కోసం ఒక పవర్‌ఫుల్ సిచువేషన్‌ను సిద్ధం చేయగా, అందులో విజయ్ పక్కన స్టెప్పులేసేందుకు 'కన్నప్ప' ఫేమ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెతో చర్చలు నడుస్తున్నాయని, అంతా అనుకూలిస్తే రౌడీ హీరోతో కలిసి ప్రీతి ముకుందన్ మాస్ డ్యాన్స్‌తో థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమని అంటున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెంచే మరో క్రేజీ అప్‌డేట్ ఏంటంటే.. టాలీవుడ్ యాంగ్రీ మ్యాన్, సీనియర్ హీరో రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్‌ను మునుపెన్నడూ చూడని విధంగా, ఎంతో వైవిధ్యంగా డిజైన్ చేశారట.





# ఆర్చర్ గురి అదిరింది!

## ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్.. ముంబైపై ఘన విజయం.. ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి

**పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్‌కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది.**

వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3-17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్(60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది.



**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**


| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 14 | 9 | 5 | 18 |
| గుజరాత్ | 14 | 9 | 5 | 18 |
| హైదరాబాద్ | 14 | 9 | 5 | 18 |
| రాజస్థాన్ | 14 | 8 | 6 | 16 |
| పంజాబ్ | 14 | 7 | 6 | 15 |
| ఢిల్లీ | 14 | 7 | 7 | 14 |
| కోల్‌కతా | 14 | 6 | 7 | 13 |
| చెన్నై | 14 | 6 | 8 | 12 |
| ముంబై | 14 | 4 | 10 | 8 |
| లక్నో | 14 | 4 | 10 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3-17) చెలరేగాడు.వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2-26), బర్గర్(2-43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. రాజస్థాన్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న ముంబై బ్యాటింగ్‌లో తడబడుతోంది. తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ(0)ను డకౌట్ చేసిన ఆర్చర్(3-17) తర్వాతి ఓవర్లో నమన్ ధిర్(6)ను బౌల్డ్ చేసి రెండో వికెట్ అందించాడు. బర్గర్ ఓవర్లో రికెల్టన్(12)కవర్స్‌లో వైభవ్ చేతికి చిక్కగా. 24 వద్ద మూడో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(60)తో కలిసి తిలక్ వర్మ(3) ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నాడు. కానీ, బ్రిజేష్ అతడిని బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది ముంబై. విల్ జాక్స్(33) జతగా సూర్య ధనాధన్ ఆడగా ముంబై స్కోర్ వంద దాటింది. అయితే.. ఐదో వికెట్‌కు 63 రన్స్ జోడించిన జాక్స్‌ను యశ్ రాజ్ ఔట్ చేయగా వస్తూనే హార్దిక్ పాండ్యా(34) రెండు సిక్సర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. గెలిపించే బాధ్య తీసుకున్న ఈ ఇద్దరూ రాజస్థాన్‌ను భయపెట్టారు. రెండో స్పెల్‌లో ఆర్చర్ మరో వికెట్ అందిస్తూ పాండ్యాను వెనక్కి పంపాడు. కార్బిన్ బాష్(2) విఫలమవ్వగా.. శార్దూల్ ఠాకూర్(10 నాటౌట్) అండతో ముంబైని గట్టెక్కించాలనుకున్న సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. చివరి ఓవర్లో 37 రన్స్ అవసరమవ్వగా శనక ఆరు పరుగులే ఇచ్చాడు. దాంతో.. 30 పరుగులతో గెలుపొందిన రాజస్థాన్ నాలుగో స్థానంతో మురిసింది. ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు టాపార్డర్ బ్యాటర్లు తేలిపోయారు. పవర్ ప్లేలోనే ముంబై ఇండియన్స్ బౌలర్లు మూడువికెట్లతో దెబ్బతీయగా.. మిడిలార్డర్ సైతం తడబడింది. దంచికొట్టే ఓపెనర్లు స్వల్ప స్కోర్‌కే ఔటైన వేళ ధ్రువ్ జురెల్(38), ఆర్చర్(32)లు ఆపద్భాదంవులయ్యారు. కానీ, డెత్ ఓవర్లలో శార్దూల్(2-41) విజృంభించినా జడేజా(19 నాటౌట్) మెరుపులతో రాజస్థాన్ రెండొందలు కొట్టింది.

## వార్నర్‌ను బ్లాక్ చేసిన ఎస్ఆర్‌హెచ్

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ, తమకు ఏకైక ఐపీఎల్ కప్ అందించిన మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌ను సోషల్ మీడియాలో బ్లాక్ చేసిందనే వార్త ఐపీఎల్ అభిమానుల్లో తీవ్ర దుమారాన్ని రేపుతోంది. తన ఆస్ట్రేలియా తోటి ఆటగాడు, ప్రస్తుత సన్‌రైజర్స్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ను అభినందిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక స్టోరీ పెట్టడానికి ప్రయత్నించిన సమయంలో.. ఎస్ఆర్‌హెచ్ అధికారిక పేజీ తనకు కనిపించకపోవడంతో తాను బ్లాక్‌కు గురైన విషయాన్ని వార్నర్ స్వయంగా సోషల్ మీడియా స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టారు. 2021 సీజన్ మధ్యలో వార్నర్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించి, ఆ తర్వాత జట్టు నుంచి కూడా తప్పించినప్పటి నుంచి ఫ్రాంచైజీకి, అతనికి మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఆ సమయంలోనే ఈ బ్లాకింగ్ వ్యవహారం జరిగి ఉంటుందని స్పష్టమవుతోంది. ఈ విషయం బయటకు రావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు ఫ్రాంచైజీ యాజమాన్యం తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ జట్టుకు ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన రికార్డును అందించడమే కాకుండా, 2016లో ఒంటిచేత్తో టైటిల్ గెలిపించిన ఒక దిగ్గజ ఆటగాడికి ఇలాంటి అవమానం జరగడంపై సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. సన్ రైజర్స్ జట్టుకు ఎంతో సేవ చేసిన ఆటగాడిని ఇలా దూరం పెట్టడం అభిమానుల తీవ్రంగా గాయపరుస్తోందని నెటిజన్లు మండిపడుతున్నారు.






# రేపే క్వాలిఫయర్ 1

## గుజరాత్‌తో ఆర్సీబీ ఢీ.. ఎల్లుండి ఎలిమినేటర్ మ్యాచ్.. ఉత్కంఠ రేపుతున్న ప్లేఆఫ్స్

ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన లీగ్ దశను ముగించుకుని ఇప్పుడు అసలైన నాకౌట్ సమరానికి సిద్ధమైంది. రెండు నెలల పాటు క్రికెట్ అభిమానులను అలరించిన హోరాహోరీ పోరాటాల అనంతరం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు అధికారికంగా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టాయి. ఇక టైటిల్ కోసం జరగబోయే అసలైన యుద్ధం మే 26 నుంచి ప్రారంభం కానుంది. మే 31న అహ్మదాబాద్‌లోని ప్రపంచ ప్రఖ్యాత నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గ్రాండ్ ఫినాలే జరగనుంది. ఈసారి ప్లేఆఫ్స్ చేరిన నాలుగు జట్లూ అద్భుత ఫామ్‌లో ఉండటం అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. సమిష్టి ప్రదర్శనలు, స్టార్ ఆటగాళ్ల మెరుపులు, యువ ఆటగాళ్ల ధాటికి ఈ సీజన్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత సీజన్ విజేతగా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈసారి కూడా అదే జోరును కొనసాగించింది. 14 మ్యాచుల్లో 9 విజయాలు సాధించి ం0.783 నెట్ రన్‌రేట్‌తో టేబుల్ టాపర్‌గా నిలిచింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 563 పరుగులతో మరోసారి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగా, దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటీదార్, వెంకటేశ్ అయ్యర్, టిమ్ డేవిడ్‌లు బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచారు. బౌలింగ్ విభాగంలో స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్ 24 వికెట్లతో ప్రత్యర్థులను భయపెట్టాడు. అతనికి జోష్ హేజిల్‌వుడ్ అద్భుత సహకారం అందించాడు. కృనాల్ పాండ్య ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు అదనపు బలంగా మారింది. దీంతో ఆర్సీబీ మరోసారి కప్ నిలబెట్టుకునే ప్రధాన ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

సీజన్ ప్రారంభంలో పెద్దగా అంచనాలు లేకపోయినా, గుజరాత్ టైటాన్స్ రెండో అర్ధభాగంలో అసాధారణ ఆటతీరుతో అందరినీ ఆశ్చర్యపరిచింది. తొలి దశలో తడబడిన జట్టు, తర్వాత వరుస విజయాలతో మొత్తం 9 మ్యాచ్‌లు గెలిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత నాయకత్వం జట్టుకు ప్రధాన బలం కాగా, సాయి సుదర్శన్




నిలకడైన ప్రదర్శనతో ఆరెంజ్ క్యాప్ రేసులో నిలిచాడు. జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్ కీలక సమయాల్లో మెరిశారు. మరోవైపు మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, ప్రసిద్ధ్ కృష్ణల పేస్ త్రయం ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది. రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ వంటి ఆల్‌రౌండర్లు జట్టును మరింత బలపరిచారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి అత్యంత ప్రమాదకర జట్టుగా మారింది. 9 విజయాలు సాధించినప్పటికీ నెట్ రన్‌రేట్ కారణంగా మూడో స్థానంతో సరిపెట్టుకుంది. కానీ బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ ఈ జట్టు అత్యంత సమతుల్యంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌ల ఓపెనింగ్ జోడీ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. మిడిల్ ఆర్డర్‌లో ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ జట్టుకు భారీ స్కోర్లు అందించారు. ముఖ్యంగా క్లాసెన్ స్థిరత్వం హైదరాబాద్‌కు పెద్ద బలం. బౌలింగ్‌లో యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, శివాంగ్, సకిబ్ మెరుగైన ప్రదర్శన కనబరిచారు. లంకన్ యువ పేసర్ ఇషాన్ మలింగ పర్పుల్ క్యాప్ రేసులో దూసుకుపోతున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వ్యూహాలు జట్టుకు పెద్ద ప్లస్‌గా మారాయి.

మధ్యలో వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్, చివరి దశలో అద్భుతంగా పుంజుకుని ప్లేఆఫ్స్ బెర్తును దక్కించుకుంది. లఖ్‌నవూ, ముంబైపై కీలక విజయాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 583 పరుగులతో ఈ సీజన్ సంచలనంగా మారాడు. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ 21 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించాడు. ధ్రువ్ జురెల్ నిలకడైన బ్యాటింగ్, కెప్టెన్ రియాన్ పరాగ్ కీలక ఇన్నింగ్స్‌లు జట్టును నాకౌట్ దశకు చేర్చాయి. మే 26న క్వాలిఫయర్-1లో ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. మే 27న జరిగే ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య హై-వోల్టేజ్ పోరు జరగనుంది. మే 29న క్వాలిఫయర్-2, మే 31న గ్రాండ్ ఫినాలే జరుగనున్నాయి. ఈసారి కప్ కోసం పోటీ పడుతున్న నాలుగు జట్లూ సమాన బలంతో కనిపిస్తున్న నేపథ్యంలో, ఐపీఎల్ 2026 ట్రోఫీ ఎవరి చేతుల్లోకి వెళ్తుందన్న ఉత్కంఠ అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది.

### క్వాలిఫయర్-1

**ఆర్సీబీ వర్సెస్ గుజరాత్ టైటాన్స్**

**తేదీ:** మే 26, 2026. **మ్యాచ్:** క్వాలిఫయర్-1
**జట్లు:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ గుజరాత్ టైటాన్స్
**ప్రాధాన్యం:** ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.
**ఓడిన జట్టు:** క్వాలిఫయర్-2లో మరో అవకాశం పొందుతుంది.

**మ్యాచ్‌పై అంచనాలు:**

ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న రెండు జట్లు తలపడుతున్నాయి. విరాట్ కోహ్లీ నేతృత్వంలోని ఆర్సీబీ బ్యాటింగ్ దూకుడు ఒకవైపు ఉండగా, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ సమతుల్య జట్టుతో బరిలోకి దిగుతోంది. భువనేశ్వర్ కుమార్ - హేజిల్‌వుడ్ పేస్ దాడికి ఎదురుగా సిరాజ్ - రబాడ బౌలింగ్ త్రయం పోటీ ఆసక్తికరంగా మారనుంది.

### ఎలిమినేటర్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్**


**తేదీ:** మే 27, 2026. **మ్యాచ్:** ఎలిమినేటర్
**జట్లు:** సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్
**ప్రాధాన్యం:** ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు టోర్నీ నుంచి నేరుగా నిష్క్రమిస్తుంది. **గెలిచిన జట్టు:** క్వాలిఫయర్-2లో అడుగుపెడుతుంది.

**మ్యాచ్‌పై అంచనాలు:**

ఈ మ్యాచ్‌ను ఈ సీజన్‌లో అత్యంత హై-వోల్టేజ్ పోరుగా భావిస్తున్నారు. అభిషేక్, హెడ్‌ల దూకుడుతో హైదరాబాద్ బలంగా కనిపిస్తుండగా, వైభవ్ సూర్యవంశీ, జోఫ్రా ఆర్చర్‌లతో రాజస్థాన్ కూడా ప్రమాదకర జట్టుగా మారింది. ప్యాట్ కమిన్స్ వ్యూహాలకు ఎదురుగా రియాన్ పరాగ్ నాయకత్వం ఎలా నిలబడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

**తర్వాతి మ్యాచ్‌లు**

**క్వాలిఫయర్-2:** మే 29, 2026
క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు వర్సెస్ ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు
**గ్రాండ్ ఫినాలే:** మే 31, 2026
**వేదిక:** నరేంద్ర మోదీ స్టేడియం, అహ్మదాబాద్



# చివరి పంచ్ ఢిల్లీదే!

**రాణించిన రాహుల్, కుల్దీప్**

చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తుగా ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. రాహుల్(60) అర్ధ శతకంతో భారీ స్కోర్ కొట్టిన ఢిల్లీ.. కుల్దీప్ యాదవ్(3-29), ఎంగిడి(3-27) జోరుతో కోల్‌కతాను కట్టి చేసింది. రహానే(63) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా సహకరించేవాళ్లు కరువయ్యారు. పావెల్() రనౌటవ్వడంతో ఢిల్లీ 40 పరుగుల తేడాతో గెలుపొందింది. పంతొమ్మిదో సీజన్ లీగ్ దశ ముగిసింది. డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జయభేరి మోగించడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ నిరాశగా ఇంటిదారి పట్టింది. డేంజరస్ ఓపెనర్ ఫిన్ అలెన్(20)ను బౌల్డ్ చేసిన ఎంగిడి(3-27) కోల్‌కతాకు షాకిచ్చాడు. కెప్టెన్ అజింక్యా రహానే(63)తో కలిసి దంచేసిన మనీశ్ పాండే(25)ను ఎంగిడి వెనక్కి పంపాడు. సిక్సర్ బాదిన పాండే బౌండరీకి యత్నించి స్టార్క్ డైవింగ్ క్యాచ్‌కు డగౌట్ చేరాడు. అర్ధ శతకం పూర్తి చేసుకున్న రహానే.. పావెల్(29)తో కలిసి గెలుపు బాధ్యత తీసుకున్నాడు. కానీ, కుల్దీప్ యాదవ్(3-29) ఒకే ఓవర్లో రహానే, రింకూ సింగ్(0)లను ఔట్ చేసి కోల్‌కతాను కష్టాల్లోకి నెట్టాడు. అనంతరం.. పావెల్ దూకుడుగా ఆడినా రజ్వీ విసిరిన త్రోకు రనౌటవ్వగా ఢిల్లీ విజయం ఖాయమైంది. స్టార్క్() ఓవర్లో అనుకుల్ రాయ్, కార్తిక్ త్యాగీలు ఔటయ్యారు. చక్రవర్తిని ఎంగిడి చివరి వికెట్‌గా వెనక్కి పంపగా కోల్‌కతా పరిమితమైంది. ప్లే ఆఫ్స్ బెర్తు చేజారిన వేళ ఢిల్లీ క్యాపిటల్స్ ఈడెన్ గార్డెన్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేస్తూ ఓపెనర్ కేఎల్ రాహుల్(60) అర్ధ శతకంతో చెలరేగగా.. అక్షర్ పటేల్(39) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు.



కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడిన ఈ ద్వయం వెనుదిరిగినా.. డెత్ ఓవర్లలో మిల్లర్(28), అశుతోష్ శర్మ(18 నాటౌట్)లు దంచేశారు. ఫలితంగా కోల్‌కతాకు 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 25-5-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# కులం.. సామాజిక న్యాయ సాధన

భారతదేశంలో కులం అనేది ఒక సామాజిక వర్గీకరణ మాత్రమే కాదు, అది దశాబ్దాలుగా మనుషుల జీవన ప్రమాణాలను, అవకాశాలను నిర్దేశిస్తున్న ఒక కఠోర వాస్తవం. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా, సమాజంలో కులాల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదన్నది కాదనలేని సత్యం. ఈ నేపథ్యంలోనే, రిజర్వేషన్లు మరియు సామాజిక సాధికారతకు సంబంధించిన వివిధ కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, కులగణన (ఝుర్వ జవఅంబం) ఆవశ్యకతను దేశం ముందు మరోసారి బలంగా నిలబెట్టాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కులగణనపై జరుగుతున్న భారీ చర్చ, కేవలం రాజకీయ అజెండాగా కాకుండా, ఒక సామాజిక అవసరంగా రూపాంతరం చెందుతోంది. సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందాలంటే, ప్రభుత్వాల వద్ద కచ్చితమైన శాస్త్రీయ దత్తాంశం ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం పదేపదే స్పష్టం చేస్తోంది. ఏ వర్గానికి ఎంత రిజర్వేషన్ కల్పించాలన్నా, లేదా ఉప వర్గీకరణ చేయాలన్నా వారి జనాభా, సామాజిక-ఆర్థిక వెనుకబాటుతనంపై స్పష్టమైన లెక్కలు ఉండాలి. సరైన ఆధారాలు లేకుండా ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. ఈ చట్టపరమైన చిక్కులను అధిగమించడానికి కులగణన అనేది ప్రభుత్వాలకు ఒక ప్రాథమిక అవసరం. జనాభాలో సగానికి పైగా ఉన్న ఇతర వెనుకబడిన తరగతులకు, ఇతర అణగారిన వర్గాలకు దేశ సంపదలో, ఉద్యోగాల్లో, విద్యలో దక్కుతున్న వాటా ఎంత? ఈ ప్రశ్నకు సమాధానం దొరకాలంటే జనాభా దామాషా తెలియాలి. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అని అంచనా వేయడానికి ఈ గణన ఒక 'సామాజిక ఎక్స్-రే'లా పనిచేస్తుంది. కొన్ని కులాలు తరతరాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయి. వారిని గుర్తించి ప్రధాన స్రవంతిలో కలపడానికి ఇది దోహదపడుతుంది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో కులగణనపై రాజకీయ, సామాజిక పక్షాల మధ్య తీవ్ర చర్చ నడుస్తోంది. కులగణన వల్ల సమాజంలో కులాల మధ్య అంతరాలు మరింత పెరుగుతాయని, సమాజం విడిపోతుందనేది కొందరి ఆందోళన. జబ్బు ఉందో లేదో తెలుసుకోవడానికి చేసే పరీక్షను తప్పుబట్టలేము. కులాలు ఇప్పటికే ఉన్నాయి, వాటి మధ్య అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటిని దాచిపెట్టడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పైగా, బీహార్ వంటి రాష్ట్రాలు సాహసోపేతంగా కులగణన చేపట్టి ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి, ఇది జాతీయ స్థాయిలో కులగణన ఆవశ్యకతను మరింత పెంచింది. కులగణనను కేవలం రాజకీయ పార్టీల ఓటు బ్యాంకు లెక్కల సాధనంగా చూడకూడదు. అదొక సామాజిక న్యాయ సాధన ప్రక్రియ. సుప్రీంకోర్టు సైతం వాస్తవిక డేటా అవసరాన్ని నొక్కి చెబుతున్న తరుణంలో, ప్రభుత్వాలు ఇక సాకులు వెదకడం మాని పారదర్శకమైన కులగణనకు ఉపక్రమించాలి. ఎవరి జనాభా ఎంతో, వారి స్థితిగతులు ఏమిటో తేలితేనే, "అందరికీ సమాన అవకాశాలు" అనే రాజ్యాంగ లక్ష్యం నెరవేరుతుంది. సమసమాజ నిర్మాణం వైపు దేశం వేసే తొలి అడుగు, ఒక సమగ్రమైన, శాస్త్రీయమైన కులగణనతోనే ప్రారంభం కావాలి.

## దేవుళ్లు..

### భూమికి ఎలా వచ్చేవారు?

వ్యోమగాములా దేవుళ్లు?

జంతు వాహనాలు నిజమేనా?

దేవుళ్లు వాడిన వాహనాలేమిటి?

టూవీలర్సా? ఫోర్ వీలర్సా?

లేక రథాలేనా వారి వాహనాలు?

అవి ఎలా నడిచేవి?

వాడిన ఇంధనం ఏమిటి?

### ఎగిరే రథాలున్నాయా?




నలభై వేల ఏళ్ల క్రితం దేవుళ్లు భూమ్మీదకు తరచూ వచ్చేవారా? వాళ్లు వ్యోమగాములా? అంతరిక్షం నుంచి అవనిలోకి ఎలా వచ్చేవారు? ఏ వాహనంపై వచ్చేవారు? టూవీలర్స్ ఉండేవా? లేక ఫోర్ వీలర్సా.. అసలు వీల్స్ లేని ఫ్లైయింగ్ సాసర్లా? ఎలా వచ్చేవారు? ఒక వేళ ఫ్లైయింగ్ మిషన్ అయితే అది ఎలా ఉండేది? అందులో ఏ ఇంధనాన్ని వాడేవారు? బోలెడు ప్రశ్నలు. జవాబులు వెతుక్కున్నా దొరుకుతాయో లేదో తెలియని ప్రశ్నలు.. మనం సినిమాల్లో చూసినట్లు దేవుళ్లు అనుకున్న సమయానికి మాయమై.. అనుకున్న చోటికి క్షణాల్లో చేరిపోవాలి కదా. మరి ఈ వాహనాలేమిటి? వీటి కథా కమామిషు ఏమిటి?



- కోవెల సంతోష్ కుమార్
రచయిత
9052116463

# దేవుని రథం.. సూపర్ టెక్నాలజీ

**రోదసి నుంచి భూమి మీదకు... భూమి నుంచి తిరిగి రోదసిలోకి... సూపర్ సోనిక్ రాకెట్ కంటే వేగం.. మనం ఇవాళ ఉపగ్రహాలలో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపిస్తున్నట్లే, నాడు ఇతర గ్రహాల నుంచి కూడా భూమి మీదకు రాకపోకలు సాగాయి. అద్భుతమైన టెక్నాలజీతో తయారు చేసిన చారియట్లలో భూమ్మీదకు ప్రయాణాలు జరిగాయి. ఆ వచ్చిన వారు రోమ్ ప్రజలకు ఏంజిల్స్ అయితే, భారత దేశానికి దేవుళ్లయ్యారు.. మరి వారి వాహనాలు సూపర్ టెక్నాలజీకి రుజువులు. వాతావరణంలో ఉన్నా, శూన్యంలో ఉన్నా, భూమిపై అయినా, ఆకాశంలో అయినా, వాయువు అందుకోలేని వేగం, కాల వేగాన్ని మించిన స్పీడ్. ఒక గ్రహం నుంచి వేరే గ్రహానికి ఒక మిల్కీవే నుంచి మరో మిల్కీవే వరకు అలవోకగా జర్నీ. గాల్లో ఎగురుతాయి. శూన్యాన్ని చీల్చుకుని వెళ్తాయి. రోదసి నుంచి భూమ్మీదకు. ఫ్లైయింగ్ డివైస్లలో రాక. వెహికిల్స్లో వాడిన ఇంధనం ఏమిటి? ఆనాడు పెట్రోలు ఉందా? మరింకేదైనా ఇంధనమా? ఇంజన్ స్పీడ్ ఎంత? హెల్మెట్లు ధరించేవారా?**



పురాణాల్లో, ఇతిహాసాల్లో భక్తులకు దేవుడు దర్శనమివ్వటం మనకు తెలుసు. ఎన్టీయార్ సినిమాల్లో ఇలాంటి సీన్లు మామూలే.. తపస్సు చేస్తే దేవుడు ప్రత్యక్షమవుతాడు.. యజ్ఞం చేస్తే దేవుడు వచ్చేస్తాడు.. నోములు నోస్తే అమ్మవారు కరుణిస్తుంది. దివి నుంచి భువికి దిగి వచ్చి కోరిన వరాలను కొండంత ఇచ్చి వెళ్లిపోతారు. నిజానికి వాళ్లు ఎలా వచ్చేవారు.. ఎలా వెళ్లిపోయేవారు? వారు ఉపయోగించిన వెహికిల్స్ ఏమిటి? అన్నది ఇప్పటికీ మిస్టరీయే. మన దేవుళ్లకేమో ఉన్న వాహనాలు విచిత్రంగా ఉంటాయి. మహాశివుడికి నంది వాహనం.. విష్ణుమూర్తికేమో గరుత్మంతుడు, అమ్మల్లో ఒక అమ్మకేమో సింహం, మరో అమ్మకు హంస... ఇంద్రుడికి ఏనుగు.. గణపతికి ఎలుక.. కుమారస్వామికి నెమలి, అయ్యప్పకు పెద్ద పులి.. ఏమిటివి? వాహనాలేనా? దేవుళ్లను చూస్తేనేమో మనలాగే కనిపిస్తారు. కాకపోతే వేషంలో కాస్త డిఫరెంట్.. మరి అలాంటప్పుడు ఈ జంతువులపై దేవుళ్లు తిరగటమేమిటి? భక్తుల కోర్కెలు తీర్చేందుకు ఈ వాహనాలపైనే వాళ్లు వచ్చేవారా? లేక వేరే వాహనాలేమైనా ఉన్నాయా? అసలు దేవుళ్లకు ఉన్న వాహనాలేమిటి? దేవుళ్లకు జంతు వాహనాలన్నది మన ఇతిహాసాల్లో ప్రతీకాత్మకంగా చెప్పిందే తప్ప.. మరేమీ కాదు.. ఆయా దేవీ దేవతల స్వరూప స్వభావ సామర్థ్యాలను బట్టి ఆయా జంతు వాహనాలను మనమే కల్పించుకున్నాం. కానీ, వాళ్లు ఇంతకంటే జెట్ స్పీడ్ వాహనాల్లో తిరిగారు. గుర్రాలు పూన్చిన రథాలపై రామాయణ, మహాభారత యుద్ధాలు జరిగాయన్నది మనకున్న సినిమా నాలెడ్జి. కానీ అంతకంటే అడ్వాన్స్డ్ టెక్నాలజీ మన వాళ్ల సొంతం. రోదసి నుంచి గాడ్స్ సూపర్ టెక్నలాజికల్ ఎయిర్ వెహికిల్స్లో తిరిగేవారు. ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి వెళ్లేవారు.. మనుషులకూ హెల్ప్ చేసేవారు. ఇవే వారికి రథాలు.. మనకు విమానాలు.. జస్ట్ అంతే తేడా. గ్రహాంతర వాసులు, గాడ్స్ భూమ్మీదకు వచ్చి వెళ్లినట్లు ప్రీ-హిస్టారిక్ ఆనవాళ్లు చాలా ఉన్నాయి. పెరూ ఇందుకు పెద్ద ఉదాహరణ.. పెరూలోని నాజ్కా ప్రాంతంలో 40 వేల ఏళ్ల నాటి ఎయిర్పోర్టు కనిపించాయి. గాడ్స్ ఎయిర్ క్రాఫ్ట్లకు సంబంధించిన నమూనాలు కూడా వరల్డ్ ఆర్కియాలజిస్టులకు లభించాయి. అంతే కాదు.. పెరూలో కనిపించిన కొన్ని బొమ్మల్లో ఇతర గ్రహాల నుంచి వచ్చిన వాళ్లవీ ఉన్నాయి. వాళ్లు హెల్మెట్ కూడా ధరించినట్లు తెలుస్తోంది.

జీసెస్ కు సంబంధించిన బైబిల్ చిత్రాల్లో, రామాయణ భారతాలకు చెందిన ప్రాచీన పెయింటింగ్స్లో ఏంజిల్స్ ఎయిర్ క్రాఫ్ట్ను మనం చూడవచ్చు. ఎగిరే రథాలపై తిరుగుతూ యుద్ధాలు కూడా చేసినట్లు ఈ బొమ్మలు చెప్తున్నాయి. అంటే మన పురాణాలు, ఇతిహాసాల్లో పేర్కొన్న అంశాలు, బైబిల్ చెప్తున్న కథలు, ఖురాన్ విప్పి చెప్పిన విషయాలు పూర్తిగా సత్యదూరం కావన్నమాట. మనం ఇవాళ ఉపగ్రహాలను పంపిస్తున్నాం. స్పేస్ రీసర్చ్ కోసం వ్యోమగాములు వాటిలో వెళ్తున్నారు. స్పేస్ టూరిజం కూడా డెవలప్ అవుతోంది.. స్టోన్ ఏజ్లో కూడా ఇతర గ్రహాల నుంచి మన ప్లానెట్పైకి గ్రహాంతర వాసులు వచ్చేవారా? అవుననటానికి చాలా ఆధారాలున్నాయి. చిత్రాల్లో సాక్ష్యాలు కనిపించాయి. ఆర్కియాలజికల్ ఎవిడెన్స్ కూడా చాలినంత ఉంది.. దేవుళ్లు కూడా భూమికి ఆవల ఉండేవారు కాబట్టి వాళ్లూ గ్రహాంతర వాసులే కదా... మనిషికి సహాయం చేసేందుకు వారూ ఇలాగే వచ్చేవారా? 1969 జూలై 20 నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుడిపై తొలి అడుగు మోపిన మనిషి.. ఈ భూమ్మీద నుంచి మరో గ్రహానికి వెళ్లిన తొలి వ్యక్తి. జస్టక్ గ్రహాంతర వాసి. 2008 మే నెలలో వాటికన్ ఒక ప్రెస్ రిలీజ్ చేసింది. ఇతర గ్రహాల్లో జీవులు ఉన్నట్లు ఆధారాలున్నాయన్నది ఆ ప్రెస్ నోట్ సారాంశం. ఇప్పుడు మార్స్లో ఐస్ కనిపించింది.. నీటి ఆధారాలు ఉన్నట్లు తేలింది. ఇవన్నీ ఇతర గ్రహాల్లో జీవులు ఉన్నారనటానికి క్రమంగా బలపడుతున్న ఆధారాలు.. వీటన్నింటికీ మించి 1968లో అంటే నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ వాడిన విమానాల్లో మెర్క్యూరీని ఇంధనంగా వాడినట్లు తెలుస్తోంది. భూవాతావరణంలో ఆనాడు వారికి హైడ్రోజన్ అవసరం రాలేదు. మెర్క్యూరీని ఇంధనంగా ఉపయోగించారు. దీని వల్ల గాడ్స్ వెహికిల్స్ కంటే తక్కువే అయినా, ఇవాళ మనం ఉపయోగిస్తున్న విమానాల కంటే ఎన్నో రెట్లు వేగంగా ప్రయాణించేవి. ఈ వెహికిల్స్లో ఇంజన్లు కూడా రాకెట్లలో వాడే జెట్ ఇంజన్ల లాంటివేనని ఖగోళ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దీనివల్లనే స్పీడీనెస్ ను సాధించగలిగి ఉండవచ్చు. భారతీయ విమాన శాస్త్రంలో చూపించిన నమూనాల్లోనూ జెట్ ఇంజన్ ప్రస్తావన ఉంది. నాటి విమానాలకు వార్హెడ్స్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాచీన నాగరికతలో దొరికిన ఆనవాళ్లు, మనుషులకు టెక్నాలజీపరంగా గాడ్స్, గ్రహాంతర వాసుల నుంచి పూర్తి సహకారం అందినట్లు చెప్తున్నాయి. గ్రహాంతర వాసులను గాడ్స్ వాటికన్ సిటీ పరోక్షంగా అంగీకరించింది. మన ఇతిహాసాలు, చారిత్రక ఆధారాలు, ఖగోళ పరిశోధనలు వీటిని ఎప్పుడో నిర్ధారించాయి. చారియట్స్ ఆఫ్ గాడ్స్ రచయిత ఎరిక్ వాన్ డానికెన్ వాళ్ల ఉనికిని స్పష్టం చేస్తున్నాడు. ప్రపంచంలో ప్రాచీన నాగరికత అభివృద్ధికి వాళ్లు దోహద పడ్డారనటానికి అన్ని రకాల ఆధారాలను చూపిస్తున్నాడు. ఇక ఎంతమాత్రం ఖండించే వీలు లేదని స్పష్టం చేస్తున్నాడు.

(..ఇంకా ఉంది.. మిగతా భాగం వచ్చేవారం సంచికలో)

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.